చేనేతలకు ఊతం..!

వ్యవసాయం తరువాత అత్యధిక జనాభాకు ఉపాధి కల్పిస్తున్నది చేనేత రంగం. పోగుపోగు వడికి పొట్టపోసుకునే చేనేతలకు ఉపాధి పెనుభారమైంది. దశాబ్దాల కాలంగా ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నేతన్నలకు భరోసా ఇవ్వడం లేదు. క్షేత్రస్థాయిలో కార్మికులకు సంక్షేమ ఫలాలు అందని ద్రాక్షగా మారింది. ఇలాంటి సమయంలో చేనేత కార్మికులకు చేయూత ఇవ్వాలనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ఉచిత విద్యుత్ పథకం అమలుకు సన్నాహాలు చేస్తోంది. త్రిఫ్ట్ నిధి ద్వారా ఆర్థిక భరోసా కల్పించేందుకు శ్రీకారం చుట్టింది. అయితే కర్నూలు జిల్లాలో సహకార, సహకారేతర రంగాల్లో దాదాపు 15 వేలకు పైగా కుటుంబాలు చేనేత మగ్గాలపై ఆధారపడి జీనవం సాగిస్తుంటే, ఉచిత విద్యుత్ పథకం కింద కేవలం 2,450 కుటుంబాలను మాత్రమే గుర్తించడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికే సర్వే చేపట్టి అర్హుల జాబితాను ప్రభుత్వానికి పంపించారు. ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకుని ఉచిత విద్యుత్ పథకం అమలు చేసే అవకాశం ఉంది.



- జిల్లాలో ఉచిత విద్యుత్తుకు 2,450 కుటుంబాల ఎంపిక
- త్రిఫ్ట్ నిధి రూ.18 లక్షలు విడుదల
- జిల్లాలో 14 చేనేత సహకార సంఘాలు
- మనుగడలో ఎమ్మిగనూరు చేనేత సహకార సంఘం ఒక్కటే
- మాస్టర్ వీవర్స్‌కు భరోసా ఇవ్వాలని విన్నపం



ఎమ్మిగనూరు చేనేత సహకార సంఘం కార్యాలయం

కర్నూలు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు, ఆదోని, కోడుమూరు నియోజకవర్గాల్లో మగ్గాలపై ఆధారపడి జీనవం సాగించే చేనేత కుటుంబాలు అధికంగా ఉన్నాయి. మెజార్టీగా సహకారేతర రంగంలో ఉన్నారు. మాస్టర్ వీవర్స్ పర్యవేక్షణలో జరి అంచుపట్టు చీరల తయారీ చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో సుమారుగా 15 వేలకు పైగా చేనేత కార్మిక కుటుంబాలు ఉన్నాయి. ఎన్నికల ముందు సొంత మగ్గం ఉండి, వస్త్ర ఉత్పత్తి చేసే కార్మికులకు ఉచితంగా 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇస్తామని అప్పట్లో ప్రతిపక్ష నేతగా టీడీపీ అధినేత చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు. ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో చేనేతలు కూటమి పార్టీలను ఆదరించి ఎమ్మెల్యేలను గెలిపించారు. ఈ నియోజకవర్గాల్లో బీజేపీ, టీడీపీ గెలుపులో చేనేత పాత్ర ఎంతో ఉంది. అయితే ఏడాది గడిచినా ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇలాంటి తరుణంలో ఉచిత విద్యుత్‌కు అర్హులైన చేనేత కార్మికులకు సంబంధించి సర్వే పూర్తి చేశారు. గ్రామ, వార్డు సచివాయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు సర్వే చేసి ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల ద్వారా అర్హుల జాబితాను జిల్లా చేనేత, జౌళి శాఖ ద్వారా ప్రభుత్వానికి పంపించారు. జిల్లాలో సహకార, సహకారేతర రంగంలో 15 వేలకు పైగా కుటుంబాలు ఉంటే.. కేవలం 2,450 చేనేత కుటుంబాలకే ఉచిత విద్యుత్ పథకానికి అర్హులని గుర్తించారు. నిబద్ధతతో కూడిన సర్వే చేయలేదనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఎన్నికల్లో ఓట్ల కోసం నేతన్నల ఇంటింటికి వెళ్లి ఉచిత విద్యుత్ ఇస్తామని హామీలు గుప్పించి, గెలిచాక వారిని పట్టించుకోవడం లేదంటూ చేనేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



త్రిఫ్ట్ నిధికి రూ.18 లక్షలు విడుదల

జిల్లాలో 14 చేనేత సహకార సంఘాలు ఉన్నాయి. ఎమ్మిగనూరు చేనేత సహకార సంఘం ఒక్కటే కార్మికులకు ఉపాధి కల్పిస్తోంది. ఈ సంఘంలో కూడా 500 మంది వరకు సభ్యులు ఉంటే, మగ్గంపై వివిధ వస్త్ర ఉత్పత్తులు చేసేది కేవలం 250 కుటుంబాలేనని చేనేత జౌళి శాఖ అధికారులు తెలిపారు. కోడుమూరులో నాలుగేళ్ల క్రితం రిజిస్ట్రేషన్ చేయించిన నీలకంఠేశ్వర చేనేత సొసైటీ, ఆదోనిలోని వెంకట చలపతి చేనేత సహకారం సంఘం కాస్తోకూస్తో ఉపాధి కల్పిస్తున్నాయి. ఈ సొసైటీకి ఆప్కో నుంచి నూలు (యార్న్) సరఫరా లేకపోవడం, సరిపడ కూలీలు చెల్లించకపోవడంతో అచేతనావస్థలో ఉంది. చేనేత సహకార సంఘాల్లో పని చేసే కార్మికులకు ఆర్థిక చేయూతను అందించాలనే లక్ష్యంగా 2019లో అప్పటి చంద్రబాబు ప్రభుత్వం 'త్రిఫ్ట్ నిధి'ని అమలులోకి తెచ్చింది. సంఘాల్లో పని చేసే కార్మికుడు రోజువారి వేతనంలో 8 శాతం చెల్లిస్తే, ప్రభుత్వం 16 శాతం చేర్చి త్రిఫ్ట్ నిధి ఖాతాకు జమ చేస్తుంది. చేనేత సంఘాల్లో పని చేసే కార్మికులకు ఇది ఆర్థికంగా ఉండగా ఉన్నా, సంఘాలు మొత్తం మూత పడడంతో నేతన్నలకు అందని ద్రాక్షగా మారింది. అయితే యాక్టివ్‌గా ఉన్న ఎమ్మిగనూరు చేనేత సహకార సంఘానికి ఒక్కటే రూ.18 లక్షలు నిధులు విడుదలయ్యాయి. సహకార సంఘాలతో నిమిత్తం లేకుండా మగ్గం కలిగిన ప్రతి చేనేత కార్మికుడికి ఈ పథకాన్ని వర్తింపజేయాలని సర్వత్రా డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాలో చేనేతల వివరాలు

- చేనేత సహకార సంఘాలు : 14
- యాక్టివ్ సంఘాలు : 1 (ఎమ్మిగనూరు)
- సహకార రంగంలో సభ్యులు : 1,039
- సహకారేతర రంగంలో సభ్యులు: 2,301
- ఏ పట్టణంలో ఎందరు : ఎమ్మిగనూరు-1,430, కోడుమూరు-770, ఆదోని-330

ఉచిత విద్యుత్‌కు అర్హులైన కుటుంబాలు

ప్రాంతం	కుటుంబాలు
ఎమ్మిగనూరు	1,137
ఆదోని	184
కోడుమూరు	764
నందవరం, నాగులదిన్నె	201
గూడూరు	28
గోనెగండ్ల	41
పత్తికొండ	12
కర్నూలు సిటీ	13
వెల్దుర్తి	5
కృష్ణగిరి	19
కల్లూరు	11
ఇతర ప్రాంతాల్లో	35
మొత్తం	2,450

నేడు 'డయల్ యువర్ ఎస్ఈ'

కల్లూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా వ్యాప్తంగా విద్యుత్ వినియోగదారుల సమస్యలపై డయల్ యువర్ ఎస్ఈ నిర్వహిస్తున్నట్లు ఆశాఖ ఎస్ఈ ఎం.ఉమాపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సమస్యలపై ప్రజలు, రైతులు సెల్ నెంబరు: 7382614308కు ఫిర్యాదు చేయాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, లోటట్వేజీ సమస్య, విద్యుత్ అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉన్నారా లేదా అన్న విషయాలపై ఫిర్యాదు చేయవచ్చని ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని గ్రామాలు, మండలాలు, పట్టణాల్లోని వినియోగదారులు డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు.

రైతుబజార్ అభివృద్ధికి రూ.6 కోట్లు

ఏడీఎం నారాయణమూర్తి



సి.క్యాంపు రైతుబజారులో తనిఖీలు చేస్తున్న ఏడీఎం

కర్నూలు అగ్రికల్చర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలోని సి.క్యాంపు రైతుబజార్ మరింత అభివృద్ధికి త్వరలో రూ.6కోట్లు ప్రభుత్వం నుంచి విడుదలవుతాయని మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తి వెల్లడించారు. మంగళవారం కర్నూలు నగరంలోని సి.క్యాంపు రైతుబజారును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పొదుపులక్ష్మి సంఘాల మహిళలతో మాట్లాడారు. త్వరలోనే సి.క్యాంపు రైతుబజారుకు మంచి రోజులు వస్తాయన్నారు. ఇటీవల సీఎం చంద్రబాబు నాయుడు పర్యటించిన సమయంలో నిధులు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు రాగానే రైతుబజారుకు పక్కనే ఉన్న స్థలాన్ని అభివృద్ధి చేసి అక్కడ 34 స్టాళ్లను ఏర్పాటు చేస్తామని స్పష్టంచేశారు. సెల్లార్‌ను కూడా నిర్మించబోతున్నామని, రైతుల కోసం అన్న క్యాంటీన్‌ను నిర్వహిస్తామని తెలిపారు. కొత్తపేట రైతుబజారులో రూ.3.80లక్షలు, గోవర్ధనగిరి రైతుబజారులో రూ.3లక్షలు, అమీన్ అబ్బాస్‌నగర్ రైతుబజారులో రూ.2.70లక్షలతో పనులు చేపడుతున్నామన్నారు. ఎమ్మిగనూరులో రైతుబజారును ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

దివ్యాంగులకు అండదండలు అందిస్తాం

- డీఈఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు
- ఘనంగా డీఈఎఫ్ ఆవిర్భావ వేడుకలు 7

బస్సులో ఊపిరాడక విద్యార్థులకు అస్వస్థత

7

కుటుంబ కలహాలతో వ్యక్తి దారుణ హత్య

మహిళల భద్రతకు కృషి

- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రత కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ తెలిపారు. మంగళవారం దూపాడు శివారులో ఉన్న అశోక ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మహిళల సంక్షేమం, భద్రత, హక్కులపై జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల హక్కులను కాపాడటానికి మహిళల రక్షణ, సంక్షేమానికి వివిధ రకాల హింస, దారుణాలను నివారించడానికి మహిళా కమిషన్ ఏర్పాటు చేశామన్నారు. మహిళల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అనేక చట్టాలు రూపొందించిందని, వాటిపై మహిళలు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సూచించారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

మహిళలు, యువతులు ఎక్కువగా మోసపూరిత మాటలు, సోషల్ మీడియాకు ప్రభావితులై సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోసపూరిత మాటలు, సోషల్ మీడియాకు లోను కాకుండా విద్యార్థినులు చదువుకుని జీవితంలో ఉన్నతంగా రాణించాలన్నారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫొటోలు షేర్ చేయకూడదని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, ఐసీడీఎస్ పీడీ నిర్మల, లోకల్ కంప్లయింట్ కమిటీ చైర్‌పర్సన్ మాధవి శ్యామల, కార్పొరేటర్ కైప పద్మలతరెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిటీ సభ్యులు మాలతి, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ విజయలక్ష్మి, ప్రొఫెసర్ సునీత, విద్యార్థినులు పాల్గొన్నారు.

అటవీ శాఖలో రూ.4.37 కోట్ల అక్రమాలు

- ఇద్దరి అరెస్టు
- అధికారుల నిర్లక్ష్యంపై అన్ని కోణాల్లో దర్యాప్తు
- వివరాలు వెల్లడించిన ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్

ఆత్మకూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలోనే సంచలనంగా మారిన అటవీశాఖ సొమ్ము కాజేసిన కేసులో ఇద్దరు నిందితులను ఆత్మకూరు పోలీసులు అరెస్టు చేశారు. మొదటి నుంచి అనుమానాస్పదంగా ఉన్న ఈ కేసులో రూ.4.37 కోట్లు అక్రమాలు జరిగినట్లు నిర్ధారణకు వచ్చారు. ఇందుకు సంబంధించిన వివరాలను మంగళవారం ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆత్మకూరు అటవీ డివిజన్ కార్యాలయంలో సుమారు 15ఏళ్ల పాటు ఏవోగా పనిచేసి గత ఏడాది జూలైలో పదవీవిరమణ పొందిన ఏ.ఎస్.చాంద్‌బాషా తాను పని చేసిన సమయంలో అటవీశాఖకు చెందిన సొమ్మును తన సొంత అవసరాలకు దారి మళ్లించాడు. తొలుత రూ.19,25,993 విలువ గల రెండు చెక్కులను ఎఫ్‌డీపీటీ నంద్యాల చెందిన అకౌంట్‌కు పంపించాల్సి ఉండగా ఆ సొమ్మును తన బంధువుల పేర్లతో డ్రా చేసుకున్నాడు. ఖాతాలోకి రూ.6,500, కుమారుడు బాషా ఖాతాలోకి రూ.2వేలు, సోదరి అమిదాబేగం ఖాతాలోకి రూ.36.36లక్షలు, మహేశ్వర ప్రింటర్స్ యజమాని వెంకటశివయ్య ఖాతాలోకి రూ.1.47కోట్లు, శివయ్య భార్య జయలక్ష్మీ ఖాతాలోకి రూ.66.9లక్షలు, అతని తల్లి రాజేశ్వరీ ఖాతాలోకి రూ.47.89లక్షలు చొప్పున దారిమళ్లించి వాటిని సొమ్ము చేసుకున్నాడు. అయితే చాంద్‌బాషా ఖాతాలోకి మాత్రం కేవలం రూ.6,500 మాత్రమే వెళ్లినట్లు తెలిసింది. అటవీశాఖ సొమ్ము స్వాహా వ్యవహారంలో



వివరాలు వెల్లడిస్తున్న ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్

దీనిపై ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ డిప్యూటీ డైరెక్టర్ ఈ ఏడాది ఏప్రిల్ 21వ తేదిన ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని విచారించగా ఇప్పటివరకు రూ.4,37,65,501 అటవీశాఖ సొమ్మును స్వాహా చేసినట్లు అధికారులు తేల్చారు. ఇందులో ప్రధాన ముద్దాయి చాంద్‌బాషా అటవీ సొమ్మును తన కుటుంబసభ్యులు, అనుచరుల ఖాతాకు మళ్లించుకున్నాడు. ఇందులో చాంద్‌బాషా సోదరుడు మగ్బూల్‌బాషా ఖాతాలోకి రూ.65లక్షలు, మరో సోదరుడు సలాంబాషా

చాంద్‌బాషా తన అక్రమాలు బయటకు పొక్కకుండా ఉండేందుకు చాలా పకడ్బందీగా వ్యవహరించాడు.

అక్రమాలు ఇలా..!

ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని బైర్లూటి, లింగాగట్టు, శిఖరం చెక్‌పోస్టులతో పాటు సాక్షిగణపతి వద్ద పార్కింగ్ ఫీజుల పేరిట పర్యావరణ రుసుం వసూలు చేస్తారు.

మిగతా 6వ పేజీలో

విద్యార్థులకు కంటి పరీక్షలు

కర్నూలు హాస్పిటల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలోని 6 నుంచి 18 సంవత్సరాల బాలబాలికలకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ ఎం.సంధ్యారెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం కర్నూలు నగరంలోని మిలటరీ కాలనీ హైస్కూల్‌లో కంటి పరీక్షలను ఆమె ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా 40 వేల మంది విద్యార్థులకు 3 నెలల్లో కంటి పరీక్షలు పూర్తి చేస్తామని తెలిపారు. ఈ పరీక్షల్లో దృష్టి లోపాలున్న వారికి చికిత్సలు చేసి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేస్తామన్నారు. కంటి పరీక్షలను పారా మెడికల్ ఆప్తాలిక్ అధికారుల సమక్షంలో నిర్వహిస్తామని ఆమె వెల్లడించారు.



కంటి పరీక్షలను ప్రారంభిస్తున్న జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ సంధ్యారెడ్డి


ఉల్లి సాగులో కర్నూలు టాప్

- ఉద్యాన శాఖ జిల్లా అధికారి రామాంజనేయులు



కర్నూలు అగ్రికల్చర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఉల్లి సాగులో రాష్ట్రంలోనే కర్నూలు జిల్లా మొదటి స్థానంలో ఉందని ఉద్యాన శాఖ జిల్లా అధికారి రామాంజనేయులు వెల్లడించారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం జిల్లాలో 91,630 హెక్టార్లలో 9,00,913 మెట్రిక్ టన్నుల ఉత్పత్తిని ఉద్యాన పంటల ద్వారా రైతులు సాధిస్తున్నారన్నారు. 4,660 హెక్టార్లలో పండ్ల తోటల సాగుతో 88,237 మెట్రిక్ టన్నులను పండిస్తున్నారన్నారు. కూరగాయలు 26,087 హెక్టార్లలో 5,71,671 మెట్రిక్ టన్నులు, సుగంధ ద్రవ్యాలకు సంబంధించి 40,296 హెక్టార్లలో 2,36,061 మెట్రిక్ టన్నులు పండిస్తున్నారన్నారు. ఈ సంవత్సరం ఉద్యాన సమగ్ర అభివృద్ధి మిషన్ ద్వారా 9,083.35 హెక్టార్లలో ఉద్యాన పంటలు రూ.8.53 కోట్ల రాయితీతో చేపడుతున్నామన్నారు. ఎన్ఎంఈవో ద్వారా ఆయిల్‌పాం సాగు కోసం 500 హెక్టార్లలో రైతులకు రూ.1.71 కోట్లు రాయితీ అందించి ప్రోత్సహిస్తున్నామన్నారు. ఉల్లి ఉత్పాదకత హెక్టారుకు 20 టన్నులు, ఎండుమిరప హెక్టారుకు 6 టన్నులు సాధించి రాష్ట్రంలో కర్నూలు జిల్లా మొదటి స్థానంలో ఉందన్నారు.

యాస్పిరేషనల్ బ్లాక్‌ల అభివృద్ధికి కృషి చేయాలి



కర్నూలు కలెక్టరేట్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): యాస్పిరేషనల్ బ్లాక్‌ల అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేయాలని నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం మధ్యాహ్నం ఢిల్లీ నుంచి నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం, అదనపు కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీతి ఆయోగ్ సీఈవో మాట్లాడుతూ జూలై 28, 2025 నుంచి ఆగస్టు 2 వరకు జరగనున్న సంపూర్ణత అభియాన్ సమ్మాన్ సమారోహ గురించి వివరించారు. నిర్దేశించిన ఆరు సూచికలు సాధించిన జిల్లాలకు అవార్డులు, ప్రశంసాపత్రాలు ఇస్తామన్నారు. వీరికి జిల్లా స్థాయి రాష్ట్ర స్థాయిల్లో అవార్డులు ఇస్తామన్నారు. అనంతరం కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులతో మాట్లాడుతూ సంపూర్ణత అభియాన్ సమ్మాన్ సమారోహ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు తగిన చర్యలు చేపట్టాలని సీపీవోను ఆదేశించారు. ఈ సమావేశంలో సీపీవో హిమప్రభాకర్‌రాజు, ఎస్ఈ ఆర్‌డబ్ల్యూఎస్ నాగేశ్వరరావు, డీపీవో భాస్కర్, డీఈవో శామ్యూల్‌పాల్, హౌసింగ్ పీడీ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పీఎల్ఐ,ఆర్‌పీఎల్ఐ ఏజెంట్లకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు న్యూసిటీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కర్నూలు డివిజన్ పరిధిలోని తపాలా శాఖలో తపాలా జీవిత బీమా(పీఎల్ఐ), గ్రామీణ తపాలా జీవిత బీమా(ఆర్‌పీఎల్ఐ) ఏజెంట్లుగా కమీషన్ ప్రాతిపదికన పని చేయుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ జి.జనార్థన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో కమీషన్ పద్ధతిన డైరెక్ట్ ఏజెంట్స్‌ను నియమిస్తామన్నారు. పదో తరగతి, ఆపై చదివి 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 25 నుంచి 31 వరకు (ఆదివారం మినహా) ఉదయం 10 గంటల నుంచి సాయంత్ర 5 గంటల వరకు పాతబస్టాండు ప్రధాన తపాలా కార్యాలయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరుకావాలని తెలిపారు. ఎంపిక చేసిన ఏజెంట్లు సెక్యూరిటీ డిపాజిట్ రూ.5 వేలు ఎన్ఎస్‌సీ రూపంలో(రీఫండబుల్) చెల్లించాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మేరకే ఏజెంట్లకు కమీషన్ ఇస్తారన్నారు. ఇతర వివరాలకు డెవలప్‌మెంట్ ఆఫీసర్ జి.హరికృష్ణారెడ్డి సెల్ నంబర్ 70130 29312ను సంప్రదించాలని సూచించారు.

దుర్గాభోగేశ్వరస్వామి ఆలయంలో మంత్రి ఆనం పూజలు



పూజలు నిర్వహిస్తున్న దేవదాయశాఖ మంత్రి

గడివేముల, జూలై 22(ఆంధ్రజ్యోతి) : దక్షిణ కాశీగా పేరుగాంచిన గడివేముల మండలంలోని దుర్గాభోగేశ్వరస్వామి ఆలయంలో రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య, నందికొట్కూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు, పూజారులు మంత్రి ఆనంకు ఘన స్వాగతం పలికారు.

మెగా టోర్నీకి సై



- ఆగస్టు 15 నుంచి 25వ తేదీ వరకు తెలుగు కబడ్డీ లీగ్
- గ్రామీణ యువతలో ప్రతిభను వెలికితీసేందుకు శ్రీకారం
- ఈనెల 25 నుంచి యువ క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ
- ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ సన్నాహాలు

కోసిగి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర కబడ్డీ సంఘం మెగా టోర్నీకి శ్రీకారం చుట్టింది. రాష్ట్ర, జిల్లా స్థాయిలో కోసిగికి కబడ్డీలో మంచి పేరుంది. గ్రామీణ యువకులను ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం కబడ్డీ లీగ్ వంటి మెగా టోర్నమెంట్లు జరిపేందుకు సిద్ధమైంది. రాష్ట్రంలో గ్రామీణ స్థాయిలో ప్రతిభ కలిగిన యువ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ నడుం బిగించింది. ఈనెల 25వ తేదీ నుంచి కాకినాడ వేదికగా యువ క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ మొదలుపెట్టినట్లు ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ కర్నూలు జిల్లా అధ్యక్షుడు చావిడి వెంకటేశ్, జిల్లా సెక్రటరీ వలకలదిన్నె వెంకటేశ్ తెలిపారు. ఆగస్టు 15 నుంచి 25వ తేదీ వరకు తెలుగు కబడ్డీ లీగ్ పేరిట మెగా టోర్నీ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. టోర్నీ విజేతకు యువ ఆంధ్ర కబడ్డీ చాంపియన్‌షిప్ టైటిల్‌ను అందజేస్తున్నామన్నారు. ఈ టోర్నీకి మొత్తం ఎనిమిది జట్లను ఎంపిక చేయనున్నారు. కర్నూలు జిల్లాలో ఆదోని, కర్నూలు, పత్తికొండ డివిజన్ల నుంచి ముఖ్యంగా కోసిగి, ఆదోని, ఆస్పరి, కౌతాళం, గోనెగండ్ల, నందవరం, ఎమ్మిగనూరు, సి.బెళగల్, కర్నూలు, మద్దికెర, ఆస్పరి, ఆలూరు, దేవనకొండ, పత్తికొండ తుగ్గలి మండలాల నుంచి కబడ్డీలో క్రీడాకారులు రాణిస్తున్నారన్నారు. ఒక్కో జట్టులో 12మంది క్రీడాకారులు, మరో ఐదుగురు రిజర్వు క్రీడాకారులను ఎంపిక చేసి పోటీలు జరిగే వేదికలను ఖరారు చేస్తున్నామని తెలిపారు. విజేతలకు, క్రీడాకారులకు ప్రతి మ్యాచ్‌లో నగదు బహుమతులు, నజరానాలు ప్రకటించేలా ఆంధ్ర కబడ్డీ అసోసియేసన్ సన్నాహాలు చేస్తుంది. పాల్గొనబోయే జట్ల ఎంపికలను ఈ నెల 25వ తేదీన ఉదయం 7 గంటల నుంచి కాకినాడలో పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ క్రీడా మైదానం వేదికగా నిర్వహించనున్నారు.

నిబంధనలు ఇవే

కబడ్డీ టోర్నీకి సంబంధించి క్రీడాకారులకు కొన్ని నిబంధనలు పెట్టారు. ప్రతి జట్టులో ఐదుగురు క్రీడాకారులు 23ఏళ్లలోపు వయస్సు వారై ఉండాలి. ప్రతి జట్టులో ఏడు మంది క్రీడాకారులు 25 ఏళ్ల లోపు వయస్సు కలిగి ఉండాలి. కాకినాడలో జరిగే ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 2001 ఫిబ్రవరి 27 తర్వాత జన్మించిన వారై, 85 కేజీల లోపు బరువు ఉండాలని ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు స్పష్టం చేశారు.



గ్రామీణ క్రీడాకారులు సద్వినియోగించుకోవాలి



కూటమి ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో యువకులను గుర్తించేందుకు ఇది మంచి అవకాశం. తెలుగు కబడ్డీ లీగ్ ఎంపిక పోటీలను గ్రామీణ క్రీడాకారులు సద్వినియోగించుకోవాలి.

● చావిడి వెంకటేశ్, ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, కర్నూలు

కబడ్డీలో కర్నూలు జిల్లాకు ప్రత్యేక స్థానం



కబడ్డీ క్రీడలో కర్నూలు జిల్లాకు ప్రత్యేక స్థానం ఉంది. జిల్లాలోని క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకొని తమ ప్రతిభను, నైపుణ్యాన్ని ప్రదర్శించి క్రీడల్లో రాణించాలి. తెలుగు కబడ్డీ లీగ్‌లో భాగంగా ప్రభుత్వం యువ క్రీడాకారులను ప్రోత్సహించి గుర్తించేందుకు ఇది మంచి అవకాశం.

● వలకలదిన్నె వెంకటేశ్, ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ, కర్నూలు

ఉరుకుంద క్షేత్రంలో శ్రావణమాస ఏర్పాట్లు



ఆలయ ముఖ ద్వారం

- పూర్తి చేసిన ఆలయ అధికారులు
- 25 నుంచి ఆగస్టు 23 వరకు ఉత్సవాలు
- లక్షల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం

కౌతాళం, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న ఉరుకుంద ఈరన్న స్వామి శ్రావణమాస ఉత్సవాలు మరో మూడు రోజుల్లో ప్రారంభం కానున్నాయి. జిల్లా నుంచే కాక కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల నుంచి లక్షలాదిగా భక్తులు ఈ ఉత్సవాలకు తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో భక్తుల రద్దీని దృష్టిని ఉంచుకుని ఆలయ అధికారులు ఇప్పటికే ఏర్పాట్లను పూర్తి చేశారు. ఆలయ డిప్యూటీ కమిషనర్/ ఈవో మేడిపల్లి విజయరాజు ఆధ్వర్యంలో ఉత్సవాలు కొనసాగనున్నాయి. గతంలో కన్నా ఈ ఏడాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక ప్రణాళికను రూపొందించారు.



పూజలందుకుంటున్న స్వామివారి మూల విరాట్(ఫైల్)

శ్రావణమాసంలో నెల రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు జిల్లాలో ప్రత్యేక స్థానం ఉంది. ఈనెల రోజుల్లో సోమ, గురువారాల్లో స్వామి వారి దర్శనానికి లక్షల్లో భక్తులు తరలి వచ్చే అవకాశం ఉంది. స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులు ఆలయంలో 9ప్రదక్షిణలు 9వారాలు అన్న సెంటిమెంట్ ఉండటంతో ఆలయం లోపల చుట్టూ 9 ప్రదక్షిణలు చేసేందుకు వీలుగా శాశ్వత ప్రత్యేక బారికేడ్లను ఏర్పాట్లు చేపట్టారు. తిరుమల, శ్రీశైలం తరహాలో స్వామి దర్శనానికి ఫ్లైఓవర్ బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణంలో వర్షం వస్తే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. భక్తులు తడవకుండా రేకుల షెడ్లను నిర్మించారు. ఆలయ ప్రాంగణంలోనే గణపతి, లక్ష్మీ అమ్మవార విగ్రహాలను తూర్పు ద్వారం వద్ద ఏర్పాటు చేసి భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు. ఆలయం లోపల నవగ్రహాలు, శాశ్వత హోమ మండపం, లక్ష పుష్పార్చన కోసం ప్రత్యేక షెడ్లను ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసి రోజు వారి పూజలను చేపట్టేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయంలో భక్తులకు తాగునీటి సౌకర్యార్థం మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు.



ఆలయం వెలుపల ఫుట్‌పాత్‌ల ఏర్పాటు

ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనానికి సంబంధించి ఈ ఏడాది ప్రత్యేకంగా ఉచిత దర్శనంతో పాటు రూ.50, రూ.100 టికెట్లను ఖరారు చేశారు. అదేవిధంగా వీఐపీ, వీవీఐపీ దర్శన ఏర్పాట్లు చేపట్టారు. వీఐపీ దర్శనంలో భాగంగా రూ.500తో శీఘ్రదర్శనం కల్పిస్తారు. రూ.1000తో స్వామి వారి అంతరాలయ దర్శనం కల్పిస్తారు. ఆలయ వద్ద స్వామి దర్శనం కోసం వచ్చే భక్తులకు రాత్రి సమయాల్లో కూడా అన్నదానం ఏర్పాట్లు చేపడుతున్నారు. అన్నదాన సత్రంలో ఒకేసారి దాదాపు రెండు వేలమంది భక్తులు భోజనం చేసేలా అన్నదాన సత్రాన్ని నిర్మించారు. ఎల్ఎల్‌సీ కాలువలో పుణ్యస్నానాలు చేసే భక్తుల కోసం ప్రత్యేకఘాట్ల నిర్మాణం చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఆలయ పరిసరాల్లో దాదాపు 180 సీసీ కెమెరాలతో నిఘా ఉంచారు. ఉత్సవాల్లో స్వామి దర్శనానికి 3వ సోమవారం 2లక్షల వరకు భక్తులు దర్శించుకునేలా ఏర్పాటు చేశారు. చివరి సోమవారం స్వామి పల్లకి ఉత్సవం కోసిగి మండలం కందుకూరు వద్ద ఉన్న తుంగభద్ర నదిలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలను జలాభిషేకం చేపట్టి ఆలయానికి చేరడంతో ఉత్సవాలు ముగుస్తాయి. ఈ ఉత్సవాల ముగిసేంత వరకు చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు నెల రోజుల పాటు మాంసాహారానికి దూరంగా ఉంటారు.



స్వామి దర్శనం కోసం వేసిన గ్రిల్ బ్రిడ్జి

అటవీ శాఖలో రూ.4.37 కోట్ల అక్రమాలు

(5వ పేజీ తరువాయి)

ఈ మొత్తాన్ని ప్రతిరోజు ఆత్మకూరు డిప్యూటీ డైరెక్టర్ పేరిట ఉన్న ఆత్మకూరు యూనియన్ బ్యాంకు ఖాతాలో జమచేసి నెలపూర్తయిన తర్వాత ఆ మొత్తాన్ని ఎఫ్‌డీపీటీ నంద్యాల పేరిట ఉన్న రాయలసీమ గ్రామీణ బ్యాంకు ఖాతాకు నగదు బదిలీ చేయాల్సి ఉంది. ఈ క్రమంలోనే ఆ విధంగా పంపించే చెక్కుల్లో చాంద్‌బాషా చేతివాటం ప్రదర్శిస్తూ కొన్ని చెక్కులను తన అవసరాలను మళ్లించుకున్నాడు. ఇందుకోసం తన కుటుంబీకులతో పాటు నేతాజీనగర్‌లోని మహేశ్వర ప్రింటర్స్ యజమాని వెంకటశివయ్యను వాడుకున్నాడు. సుమారు రూ.4.37కోట్ల విలువ చేసే చెక్కులను వారి ఖాతాలకు పంపించి ఆ తర్వాత వివిధ మార్గాల్లో వాటిని డ్రా చేసుకుని అటవీశాఖ సొమ్మును కాజేశాడు. తాను పనిచేసినంత వరకు ఈ వ్యవహారం బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నాడు. అయితే ఆయన రిటైర్డు అయిన తర్వాత ఇక్కడకు బదిలీపై వచ్చిన ఏవో రాజు రికార్డులు తనిఖీలు చేయగా పలు అవకతవకలు వెలుగు చూశాయి. పూర్తిస్థాయిలో పరిశీలించగా చెక్కుల స్వాహా బాగోతం బట్టబయలైంది. దీంతో ఆత్మకూరు డిప్యూటీ డైరెక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు సైతం విచారణ చేపట్టి ఈ కేసులో ఇప్పటివరకు ఏడుగురుని నిందితులుగా గుర్తించారు. వీరిలో ప్రస్తుతం ఇద్దరు మగ్బూల్‌బాషా, వెంకటశివయ్యలను మంగళవారం నంద్యాల రస్తాలో అరెస్టు చేయగా మరో ఐదుగురిని అరెస్టు చేయాల్సి ఉంది. ఇదిలావుంటే నిందితులకు చెందిన సుమారు రూ.2.5కోట్ల గల ఆస్తులను కూడా ప్రభుత్వానికి అటాచ్ చేసే ప్రక్రియ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హైకోర్టు ఆదేశాలతో చాంద్‌బాషా అరెస్టులో జాప్యం

హైకోర్టు ఉత్తర్వుల కారణంగానే చాంద్‌బాషా అరెస్టు జాప్యమైనట్లు పోలీసులు తెలిపారు. వాస్తవానికి అటవీ శాఖ సొమ్ము వ్యవహారంలో తొలుత అటవీశాఖ అధికారులు రూ.19.25లక్షలు మాత్రమే అవినీతి జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అప్రమత్తమైన చాంద్‌బాషా ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించి చేతులు దులుపుకొనే ప్రయత్నం చేశాడు. అయితే ఆ తర్వాత తీగ లాగితే డొంక కదిలినట్లు చాంద్‌బాషా అక్రమాలు రూ.4.37కోట్ల వరకు చేరింది. కానీ తాను వాడుకున్న రూ.19.25లక్షలను తిరిగి చెల్లించానని, తన వయస్సు రీత్యా పోలీసులు తనను అరెస్టు చేయకుండా రక్షణ కల్పించాలని చాంద్‌బాషా హైకోర్టును ఆశ్రయించాడు. దీంతో చాంద్‌బాషాను అరెస్టు చేయవద్దని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే చాంద్‌బాషా స్వాహా చేసింది రూ.19.25లక్షలు కాదని.. రూ.4.37కోట్లు అని.. ఇది పెద్ద కుట్ర అని పోలీసులు హైకోర్టులో కౌంటర్ దాఖలు చేశారు. ఇప్పటికే ఈ పిటీషన్లపై పలు వాదనలు జరిగాయి. హైకోర్టు నుంచి క్లియరెన్స్ రాగానే ప్రధాన నిందితుడైన చాంద్‌బాషాను అరెస్టు చేస్తామని పోలీసులు వెల్లడించారు.

అధికారుల నిర్లక్ష్యంపై అన్ని కోణాల్లో దర్యాప్తు

15 ఏళ్ల పాటు ఒకే కార్యాలయంలో తిష్టవేసి కోట్ల రూపాయలు కాజేస్తున్నా.. సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై కూడా పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే ఈ అక్రమాలపై అమరావతి నుంచి అటవీశాఖ వారు ప్రత్యేక కమిటీని నియమించగా పోలీసులు కూడా తమదైన శైలిలో విచారిస్తున్నారు. ప్రత్యేకించి అటవీ శాఖ, యూనియన్ బ్యాంకు, ఆడిట్ అధికారుల నిర్లక్ష్యంగా ఉన్నట్లు నిర్ధారణ అయితే వారిపై కూడా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ రామాంజినాయక్ వెల్లడించారు. అలాగే బ్యాంకు లావాదేవీలకు సంబంధించి యూనియన్ బ్యాంకు రీజనల్ మేనేజర్‌కు కూడా పలు నివేదికలను కోరినట్లు స్పష్టం చేశారు. ఇందులో బ్యాంకు అధికారులు తప్పిదాలపై కూడా పోలీసులు విచారిస్తున్నారు.

వైభవంగా సత్యసాయి బాబా రథోత్సవం

కర్నూలు కల్చరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలో పుట్టపర్తి సత్యసాయి బాబా రథోత్సవం మంగళవారం వైభవంగా సాగింది. నంద్యాల జిల్లా ఆత్మకూరు మీదుగా మంగళవారం ఉదయం కర్నూలు చేరుకున్న బాబా రథాన్ని పాతనగరంలోని జమ్మిచెట్టు సమీపంలోగల లలితా పీఠం వద్ద ప్రత్యేక పూజలు చేసి నగరంలో శోభాయాత్ర ప్రారంభించారు. లలితా పీఠం పీఠాధిపతి గురు మేడా సుబ్రహ్మణ్యం స్వామి రథానికి, సత్యసాయి బాబా చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణలతో రథాన్ని ప్రారంభించారు. మహిళా భక్తులు వందలాదిగా తరలి వచ్చి, కలశాలతో రథం ముందు సాయి నామస్మరణతో పాల్గొన్నారు. చిన్నారుల సంప్రదాయ నృత్యాలతో రథోత్సవానికి స్వాగతం పలికారు. రథోత్సవం పాతనగరంలోని జమ్మిచెట్టు వీధి మీదుగా వన్‌టౌన్, ఇస్కాల సత్రం, పూలబజార్, గడియారం ఆసుపత్రి, పెద్ద మార్కెట్, అంబేడ్కర్ సర్కిల్, కొండారెడ్డి బురుజు, మున్సిపల్ ఆఫీసు, ప్రకాశ్‌నగర్ మీదుగా నెహ్రూనగర్‌లోని సత్యసాయి మందిరానికి చేరుకుంది. అక్కడ జరిగిన పూజల్లో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డితోపాటు భక్తులు పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్నం ఎస్‌బీఐ కాలనీ, అశోక్‌నగర్, ఏపీ టూరిజం హోటల్, రామలింగేశ్వర్‌నగర్, వెంకటరమణ కాలనీ, శివరామాలయం మీదుగా సూర్యనారాయణ స్వామి ఆలయం చేరుకుంది. అక్కడ ప్రత్యేక పూజల అనంతరం కృష్ణనగర్, ఐటీసీ మీదుగా రాగమయూరి కాలనీకి చేరుకుంది. ఈ కార్యక్రమాల్లో జిల్లా సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు సాయిబాబా, కన్వీనర్ మాకా అశోక్‌కుమార్, సీనియర్ సేవాదళ్ ప్రతినిధులు పట్టాభిరామయ్య, సూర్యనారాయణ రెడ్డి, భజన మండలి కన్వీనర్ సందీప్‌కుమార్, మహిళా సేవాదళ్ ప్రతినిధులు లక్ష్మీ సరోజ, సంధ్య, శారద పాల్గొన్నారు.



సత్యసాయి రథం వద్ద పూజలు చేస్తున్న సాయి భక్తులు



పాతనగరంలో రథానికి ముందు కలశాలతో మహిళా భక్తుల ర్యాలీ

కూతురికి అన్నీ తానై..

- వింత వ్యాధితో బాధపడుతున్న లక్ష్మీదేవి
- 49 ఏళ్లుగా సపర్యలు చేస్తున్న తల్లి
- గత వైసీపీ హయాంలో పింఛన్ తొలగింపు
- కలెక్టర్ గారూ.. పింఛన్ ఇప్పించాలని మనవి



లక్ష్మీదేవికి అన్నం తినిపిస్తున్న తల్లి

అమ్మ గొప్పతనం మాటల్లో చెప్పలేనిది. ఆమె ప్రేమ, త్యాగం, ఆప్యాయత, అనురాగం అన్నీ అమూల్యమైనవి. అమ్మ తన బిడ్డల కోసం తన జీవితాన్నే త్యాగం చేస్తుంది. బిడ్డ కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలబడుతోంది. అమ్మ ప్రేమ, ఆప్యాయత వెలకట్టలేనిది. ఇలాంటి మాతృమూర్తి తన బిడ్డ కోసం అహర్నిశలు శ్రమచేస్తూ ఆమెకు సపర్యలు చేస్తోంది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 49 ఏళ్ల వయస్సు ఉన్న కన్న కూతురిని కంటికి రెప్పల్లా కాపాడుకుంటోంది. వింత వ్యాధితో బాధపడుతున్న కుమార్తె కోసం అన్నీ తానై సేవలందిస్తోంది. ఇలాంటి తల్లికి ప్రస్తుతం ఆర్థిక భారం వెంటాడుతోంది. గత వైసీపీ ప్రభుత్వం కుమార్తెకు వచ్చే పింఛన్‌ను తొలగించింది. దీంతో కూటమి ప్రభుత్వమైనా పింఛన్ ఇచ్చి ఆదుకోవాలని కలెక్టర్‌ను వేడుకుంటోంది.

కోవెలకుంట్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): 49 ఏళ్ల కూతురుకు ఆ తల్లి అన్నీ తానై సేవలందిస్తోంది. కూతురు పేరుకు మాత్రమే జీవించినా భోజనం, స్నానం, మలమూత్రాలు వచ్చినా ఎలాంటి కదలిక ఉండదు. బంధువులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన పద్మావతిబాయి, నరససింగరావు దంపతులు. వీరికి వెంకటరమణ, లక్ష్మీదేవి అనే పిల్లలు ఉన్నారు. వెంకటరమణ ప్రస్తుతం పెళ్లి చేసుకొని వేరే కాపురం పెట్టాడు. అయితే లక్ష్మీదేవి పుట్టకతోనే వింత వ్యాధితో జన్మించింది. ఎలాంటి ఉలుకు పలుకు లేకుండా జీవనం సాగిస్తోంది. అలాంటి కూతురికి తల్లి పద్మావతి బాయి అన్నీ తానై చూసుకుంటోంది. పద్మావతి బాయి భర్త నరసింగరావు క్రిష్టిపాడులోని పశువైద్యశాలలో అటెండరుగా పనిచేస్తూ 2013లో పదవీ విరమణ చేశారు. 2014లో తల్లి నుంచి కూతురు వేరై రేషన్‌కార్డు కూడా పొందడంతో అప్పటి టీడీపీ ప్రభుత్వం కూతురు లక్ష్మీదేవికి పింఛను మంజూరుచేసింది. కూతురు పింఛనుతో జీవనం సాగిస్తుండేవారు. 2020 మార్చి 5న భర్త నరసింగరావు అనారోగ్యంతో మృతి చెందడంతో భర్తకు వచ్చే పెన్షన్ భార్య పద్మావతికి మంజూరు చేసింది. తల్లికి రూ.12వేలు, కూతురుకు రూ.2వేలు పింఛను వస్తుండేది.



లక్ష్మీదేవి

జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక..

జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వలంటీర్లతో సర్వే చేయించి హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ చేయించారు. హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ చేయించడంతో తల్లికూతురు ఒకే ఇంట్లో ఉండడంతో తల్లికి ప్రభుత్వ పింఛను రూ.12వేలు వస్తుండడంతో కూతురు అర్హులైనప్పటికీ ప్రభుత్వం పింఛను తొలగించింది. తల్లికి వచ్చే పింఛనుతోనే ఆసుపత్రి, భోజనాలకు కాలం వెళ్లదీస్తుండే వారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయింది. ఇటీవల కొత్తపింఛన్లు మంజూరుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అయితే అన్ని అర్హతలు ఉండి కూడా ఎలాంటి పింఛనుకు నోచుకోకుండా లక్ష్మీదేవి తీవ్ర ఇబ్బందులు పడుతుంది. కలెక్టరు స్పందించి విచారణ జరిపించి అర్హురాలైన లక్ష్మీదేవికి రూ.6వేలు పింఛను మంజూరు చేయించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

దివ్యాంగులకు అండదండలు అందిస్తాం

- డీఈఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు
- ఘనంగా డీఈఎఫ్ ఆవిర్భావ వేడుకలు

కర్నూలు కల్చరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు అండదండలు అందించడమే తమ ధ్యేయమని డీఈఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు అన్నారు. మంగళవారం నగరంలోని వెంకటేశ్వర కల్యాణ మండపంలో దివ్యాంగుల సాధికారత ఫోరం (డీఈఎఫ్) ఆవిర్భావ దినోత్సవ సభ ఘనంగా నిర్వహించారు. డీఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బీసీ నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సెక్రెడ్ సంస్థ డైరెక్టర్ తిప్పన్న, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఈ.నాగరాజుగౌడ్, దివ్యాంగుల ఎంప్లాయీస్ యూనియన్ సెక్రటరీ క్రిష్ణుడు, టీడీపీ దివ్యాంగుల సేవా విభాగం సెక్రటరీ నీలా జోజిబాబు, డీఈఎఫ్ ప్రధాన కార్యదర్శులు ఎం. శివశంకర్, కె.ఈరన్న, ఉపాధ్యక్షుడు కమతం వెంకటేశ్, కోశాధికారి ఆదిశేషయ్య, సలహాదారుడు రామాంజనేయులు మాట్లాడారు. దివ్యాంగుల సాధికారిత కోసం, వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఎప్పుడూ వెన్నంటి ఉంటామని చెప్పారు. దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించేలా వారికి తగిన సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. దివ్యాంగులకు సంబంధించిన సామాజిక హక్కుల, చట్టాల, రాయితీ రిజర్వేషన్ల కోసం తమ సంస్థ ఎప్పుడూ పోరాడుతూనే ఉంటుందన్నారు. ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు, ఇటు దివ్యాంగులకు ఒక వారధిగా నిలుస్తుందన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు డీఈఎఫ్‌ను బలపరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వివిధ మండలాల డీఈఎఫ్ కార్యవర్గ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.



సంఘీభావం తెలియజేస్తున్న నాయకులు

యూరియా పంపిణీ చేయాలి

- ఆదోనిలో రైతుల ఆందోళన
- రైతులతో మాట్లాడిన ఎమ్మెల్యే పార్థసారథి


వ్యవసాయ కార్యాలయం వద్ద బైఠాయించిన రైతులు

ఆదోని అగ్రికల్చర్, జూలై 22(ఆంధ్రజ్యోతి): తమకు వెంటనే యూరియా పంపిణీ చేయాలని పెద్ద హరివాణం, సంతేకూడ్లూరు, జే హోసల్లి, పాండవుగల్లు, నాగనాతహళ్లి, గణేకల్లు తదితర ప్రాంతాల రైతులు డిమాండ్ చేశారు. మంగవారం మండల వ్యవసాయ కార్యాలయం డీసీఎంఎస్ కేంద్రానికి చేరుకున్న రైతులకు స్టాక్ లేదని అధికారులు చెప్పడటంతో కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. వర్షాలు కురవడంతో పత్తి, వేరుశనగ, వరి పంటకు యూరియా అవసరమని ఈ సమయంలో యూరియా లేదంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రైవేటు డీలర్లు యూరియాకు లింకు అంటగట్టి అధిక ధరలకు అమ్ముతున్నారన్నారు. ఏవో సుధాకర్ చేరుకొని ప్రైవేటు డీలర్ల దగ్గర ఉన్న యూరియాకు పర్మిట్లు రాసి పంపించేశారు. గ్రామాల్లో రైతు కేంద్రాలలో రైతులకు అవసరమైన యూరియా ఉందని ఇక్కడ వరకు రావద్దంటూ సూచించారు. కాగా డీసీఎంఎస్ కేంద్రానికి సాయంత్రం లారీలు రావడంతో పంపిణీ చేశారు.

యూరియా కొరత రాకుండా చూస్తా : ఎమ్మెల్యే

నియోజకవర్గంలోని రైతులకు యూరియా కొరత రాకుండా చూస్తానని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి హామీ ఇచ్చారు. మంగళవారం మార్కెట్ యార్డ్‌లోని డీసీఎంఎస్ వద్దకు వచ్చి రైతులతో మాట్లాడారు. ఎరువుల కొరతపై ఏవో సుధాకర్‌ను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి నాలుగు రోజుల కోసారి రైలులోఎరువు వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు అమ్మినా, లింకు అంటగట్టినా దుకాణదారులపై చర్యలు తప్పవని హెచ్చరిం చారు. మార్కెట్ యార్డ్ కార్యదర్శి కల్పన, వ్యవసాయ శాఖ ఏడీ బాలవర్ధని రాజు, ఏవో సుధాకర్, డీసీఎంఎస్ మేనేజర్ ప్రకాష్ రెడ్డి ఉన్నారు.


రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

అధికారులపై కేంద్ర బృందం అసహనం

- రికార్డుల నిర్వహణ సరిగా లేదని ఆగ్రహం


గోవిందపల్లెలో గోకులం షెడ్డును పరిశీలిస్తున్న అధికారులు


వెలుగు సిబ్బందిపై అసహనం వ్యక్తం చేస్తున్న లీడర్

ఉయ్యాలవాడ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఉయ్యాలవాడ మండలంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనులపై కేంద్ర బృందం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. మండలంలోని ఆయా గ్రామాల్లో జరుగుతున్న పనులను మంగళవారం టీమ్ లీడర్ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో కేంద్ర బృందం పరిశీలించింది. ఈ మేరకు గోవిందపల్లె, ఆర్.జంబులదిన్నె గ్రామాల్లో అధికారులు పర్యటించారు. గోవిందపల్లె గ్రామంలో పర్యటించి 2022-25 సంవత్సరాల్లో ఉపాధి హామీలో జరిగిన పనులు, వాటి ఫైళ్ల, ఎంబుక్‌లను తనిఖీ చేశారు. గ్రామంలోని ఓ రైతు నిర్మించుకున్న గోకులం షెడ్డుకు సంబంధించిన రూ.50 వేల మెటీరియల్‌కు బిల్లు చూపాలని స్థానిక అధికారులను అడిగారు. దీంతో ఆ రికార్డులు తమ వద్ద లేవని కార్యాలయంలో ఉన్నాయంటూ వారు బుకాయించారు. దీంతో కేంద్ర అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ఆర్.జంబులదిన్నె గ్రామంలో గ్రామైక్య సంఘ మహిళలతో మాట్లాడుతూ తమ విధులను వివరించాలని అడిగారు. దీంతో వారి నుంచి సరైన సమాధానం రాలేదు. గ్రామైక్య సంఘ సభ్యులకు శిక్షణ ఇచ్చారా? లేదా? అని అధికారులను ప్రశ్నించారు. పొదుపు రుణాలపై ఆరా తీశారు.

వీవో రికార్డులు చూపని వెలుగు సిబ్బంది

కేంద్ర బృందం వారు అడిగిన వీవో రికార్డులను వెలుగు సిబ్బంది, అధికారులు చూపలేక పోయారు. గతంలో పని చేసిన వీవోఏను ఈ ఏడాది ఏప్రిల్ నెలలో తొలగించామని, తొలగించిన వీవోఏ రికార్డులను తమకు అప్పగించలేదన్నారు. కొత్తగా వచ్చిన వీవో మినిట్స్, క్యాష్ బుక్ చూపించాలన్నారు. అందులో కేవలం రెండు మీటింగ్స్ మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. క్యాష్ బుక్‌కు బదులుగా 2011 బ్యాంక్ స్టేట్ మెంట్ చూపారు. 2011 నుంచి ఇప్పటి వరకు వీవో లావాదేవీలే జరగలేదా? అని ప్రశ్నించారు. అలాంటప్పుడు వీవోఏలకు జీతాలు ఏవిధంగా ఇస్తున్నారన్నారు. దీంతో సమాధానం చెప్పలేకపోయిన మండల అధికారులు నీళ్ల నమిలారు.

ఎమ్మెల్యే చెబితే నలుగురిని తొలగించాం

ఎమ్మెల్యే చెబితే మండలంలోని నలుగురు వీవోఏలను తొలగించామని వెలుగు ఏపీఎం దాసన్న కేంద్ర బృందం దృష్టికి తీసుకొచ్చారు. ఆర్.జంబులదిన్నె, ఆర్.పాంపల్లె, తుడుమలదిన్నె, పెద్దయమ్మనూరు వీవోఏలను ఏప్రిల్ నెలలో తెలగించి కొత్త వారిని నియమించామన్నారు. రికార్డులు తమకు అప్పగించటం లేదని కేంద్ర బృందం ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఆగ్రహం వ్యక్తం చేసిన కేంద్రం డీఆర్డీఏ పీడీకి ఫిర్యాదు చేస్తామన్నారు. సభ్యులు సూర్యకంటప్రధాన్, డ్వామా పీడీ సూర్యనారాయణ, ఏపీడీ సాంబశివరావు, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, పీఆర్ ఏఈ వెంకటయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రణీత్‌కృష్ణ, ఏపీవోలు హరికృష్ణ, రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగెకరాలు.. గంటన్నరలో పంట కోత

పంట కోతను కోయడంలో ఆ గ్రామానికి చెందిన కూలీలు దిట్ట. ఏ పంటనైనా గంటల్లో కోసేయగలరు. మండల కేంద్రమైన కోసిగిలోని మూడో వార్డు వాల్మీకినగర్‌కు చెందిన 19 మంది యువకులు నాలుగెకరాల వేరుశనగ పంటను గంటన్నర వ్యవధిలోనే కోసేసి భళా అనిపించుకున్నారు. కోసిగికి రైతు ఈరన్న పొలంలో మంగళవారం ఉదయం 6గంటలకే వేరుశనగ పంటను కోసేందుకు యువ కూలీలు సిద్ధమయ్యారు. అందరూ కలిసి ఉదయం 7:30గంటలకు పూర్తి చేశారు. గతంలో కూడా ఈ యువకూలీలు పోటీ పడి వేరుశనగ పంటను సమయం చెప్పి కోశారు. గతంలోనూ ఉన్న రికార్డు కంటే తక్కువ సమయంలోనే ఈసారి పంట కోసి ఘనత సాధించారు.


వేరుశనగ పంట కోత కోసిన వాల్మీకి నగర్‌కు చెందిన యువకులు

● కోసిగి, ఆంధ్రజ్యోతి

పోలీసుల వేధింపులతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ఆళ్లగడ్డ, జూలై 22(ఆంధ్రజ్యోతి): పోలీసుల వేధింపులు తాళలేక ఓ వ్యక్తి మంగళవారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పరిస్థితి విషమంగా మారడంతో నంద్యాల ఆసుపత్రికి తరలించారు. బాధితుడు పల్లె ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. చాగలమర్రి మండలం గోడిగెనూరు గ్రామానికి చెందిన పల్లె ప్రసాద్ తండ్రి నరసింహుడు, తమ్ముడు సుభాష్ 2017లో హత్యకు గురయ్యారు. ఇందులో నష్టపరిహారంగా మృతుడు సుభాష్ భార్యకు కొంత డబ్బు ఇచ్చి గ్రామపెద్దలు పంచాయితీ చేశారు. అయితే ఇప్పుడు అదే కేసు విషయంలో సుబ్బరత్నమ్మ డబ్బు కోసం పోలీసులను ఆశ్రయించిందన్నారు. డబ్బు కోసం తనను రూరల్ పోలీస్ స్టేషన్ సీఐ స్టేషన్‌కు పిలిపించి, అందరి ముందు అవమానించడంతో పాటు చెప్పిన మాట వినకుంటే కేసు పెడతానని బెదిరిస్తున్నాడని పల్లె ప్రసాద్ ఆరోపించాడు. తనపై పోలీసులు ఒత్తిడితెచ్చి రూ.8 లక్షలు అప్పు ఉన్నట్లు బాండ్‌పై సంతకం పెట్టించారని ఆవేదన వ్యక్తం చేశాడు. దిక్కుతోచని స్థితిలో ఎస్పీ కార్యాలయం సమీపంలో పురుగు మందు తాగినట్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు వివరించాడు. దీంతో అక్కడున్న వారు ప్రసాద్‌ను చికిత్స నిమిత్తం హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు.

న్యాయం చేయాలి: బాధితురాలు

చాగలమర్రి మండలం గోడిగెనూరు గ్రామానికి చెందిన సుబ్బరత్నమ్మ తన భర్త సుభాష్ హత్య కేసుకు సంబంధించి న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించారు. ఆళ్లగడ్డలో మంగళవారం రాత్రి బాధిత మహిళ సుబ్బరత్నమ్మ మీడియాతో మాట్లాడుతూ 2017లో గోడిగెనూరు గ్రామంలో తన భర్త సుభాష్, మామ నరసింహులను అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు హత్య చేశారన్నారు. ఈ కేసు విషయంలో తనతోపాటు తన బావ అయిన పల్లె ప్రసాద్ సాక్షులుగా ఉన్నామన్నారు. కాగా, తన బావ ప్రసాద్ డబ్బుకి ఆశ పడి తనను కోర్టుకు వచ్చి సాక్ష్యం చెప్పకుండా చేసి నిందితులతో రాజీ చేసి భారీ మొత్తం నగదును తీసుకున్నట్లు తెలిసిందన్నారు. ఈ విషయాన్ని అడిగేందుకు వెళ్లిన తనపై నానా దుర్భాషలాడి బయటకు గెంటివేశారన్నారు. ఈ విషయంపై తాము గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయగా ఎస్పీ ఆదేశాల మేరకు ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి తనని పిలించి విచారణ చేశారని బాధితురాలు సుబ్బరత్నమ్మ తెలిపారు. దాంతో బావ ప్రసాద్ పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసి డ్రామాలు ఆడుతున్నారని బాధితురాలు వాపోయారు. ఇందులో పోలీసుల ప్రమేయం లేదని తెలిపారు. తనకు న్యాయం చేయాలని బాధితురాలు కోరార

జీవితంపై విరక్తిచెంది వ్యక్తి ఆత్మహత్య

కొలిమిగుండ్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన వ్యక్తి జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బెలుం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలమేరకు గ్రామానికి చెందిన కంబగిరి రాముడు(45) కొన్నేళ్లుగా మద్యానికి బానిసైయ్యాడు. దీంతో తన జీవితంపై విరక్తి చెంది పేడరంగు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు అవుకు ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కోలుకోలేక మహిళ మృతి

ఆస్పరి, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ములుగుందం గ్రామానికి చెందిన అనిత(35) కోలుకోలేక మృతి చెందినట్లు సీఐ మస్తాన్‌వలి తెలిపారు. వివరాల మేరకు.. జూన్ 15న కడుపునొప్పి రావడంతో మహిళను ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో కర్నూలుకు తరలించగా అక్కడ మృతి చెందిందన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

మైనర్లపై కత్తితో వ్యక్తి దాడి

నంద్యాల టౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఎన్జీవో కాలనీకి చెందిన ఆంజి అనే వ్యక్తి తన కూతురు వెంట పడుతున్నారని మైనర్లైన ఇద్దరిపై కత్తితో మంగళవారం దాడి చేసినట్లు రెండో పట్టణ పోలీసులు తెలిపారు. వివరాలు.. సాయంత్రం ఆదే కాలనీలో వెళ్తూ కనిపించడంతో కొందరు వారే మీ అమ్మాయి వెంట పడుతున్నారని చెప్పడంతో వెంటనే దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి దారుణ హత్య

- తమ్ముడితో కలిసి భర్తను చంపిన భార్య
- పిడుగురాళ్లలో ఘటన
- మృతుడు నంద్యాల పట్టణ వాసి


రమణయ్య (ఫైల్)

నంద్యాల టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో భార్య తన తమ్ముడితో కలిసి భర్తనే దారుణంగా హత్య చేయించింది. ఈ ఘటన పిడుగురాళ్లలో చోటుచేసుకోగా మృతదేహాన్ని నంద్యాలకు తీసుకువచ్చి ఇక్కడ వేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. వివరాలు.. నూనెపల్లెకు చెందిన రమణయ్య(50)కు పిడుగురాళ్లకు చెందిన రమణమ్మతో ఇరవై ఏళ్ల క్రితం వివాహం జరిగింది. కొంతకాలం నుంచి భార్యాభర్తల మధ్య కుటుంబ కలహాలు వచ్చాయి. రెండు నెలల క్రితం రమణమ్మ పుట్టింటికి వెళ్లింది. భర్త రమణయ్య రెండు రోజుల క్రితం భార్యతో మాట్లాడి ఇంటికి తీసుకురావడానికి వెళ్లారు. సోమవారం రాత్రి అతడు మద్యం తాగి భార్యతో గొడవపడ్డాడు. దీంతో భార్య, బావమర్ది రామయ్యతో కలిసి రమణయ్య కంట్లో కారంపొడి చల్లి దారుణంగా హత్య చేసినట్లు స్థానికులు తెలిపారు. సోమవారం అర్ధరాత్రి మృతదేహాన్ని పిడుగురాళ్ల నుంచి నంద్యాలకు తీసుకువచ్చారు. భర్త ఇంటి వద్ద మృతదేహాన్ని వదిలేసి వెళ్లారు. మృతుడి కుమార్తె ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు మృతదేహాన్ని నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. నంద్యాలలో పెయింటింగ్ పని చేసేవాడు. పిడుగురాళ్ల స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బస్సులో ఊపిరాడక విద్యార్థులకు అస్వస్థత

- ఒకే బస్సులో 235మంది విద్యార్థులు, ప్రయాణికులు

దేవనకొండ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బడికి వెళ్లే ఆర్టీసీ బస్సులు పరిమితికి మించి ప్రయాణికులు ఉండటంతో ఊపిరాడక విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. బస్సు కండక్టర్ లక్ష్మన్న వివరాల మేరకు.. మంగళవారం దేవనకొండ నుంచి జిల్లెలబుడకల గ్రామానికి బయలుదేరింది. బస్సులో 235 మంది విద్యార్థులు, 7 మంది ప్రయాణికులు ఉన్నారు. పరిమితికి మించి ఎక్కడంతో మండలంలోని ఓబులాపురం వద్దకు రాగానే జిల్లెలబుడకల గ్రామానికి చెందిన కౌసిక్ (3వ తరగతి), యశ్వంత్ (3వతరగతి), కార్తిక్(2వ తరగతి), ఓబులాపురం గ్రామానికి చెందిన మేఘనాథ్(1వ తరగతి) ఊపిరాడక అస్వస్థకు గురై బస్సులోనే కుప్పకులారు. గమనించిన పిల్లలు కేకలు వెయ్యడంతో హంద్రీ కాలువ వద్ద బస్సుని ఆపి విద్యార్థులను వెంటనే కిందకు దించి సపర్యలు చేయడంతో పిల్లలు కోలుకున్నారు. దేవనకొండలోని పాఠశాలకు వెళ్లే సమయంలో బస్సు లేకపోవడంతోనే ఇలా పరిమితికి మించి విద్యార్థులు ప్రయాణిస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లెలబుడకల, ఓబులాపురం, మాదాపురం, పల్లెదొడ్డి, గద్దెరాళ్ల గ్రామాల విద్యార్థులకు రోజూ ఇలా ఇబ్బందులు తప్పడం లేదని ఆర్టీసీ అధికారులు అదనపు బస్సుని ఏర్పాటు చేయాలని జనసేన నాయకుడు కృపాకర్ ప్రభుత్వాన్ని కోరారు.


అస్వస్థతకు గురైన విద్యార్థులు

జీజీహెచ్‌ను పరిశీలించిన మహిళా కమిషన్ చైర్‌పర్సన్


గైనిక్‌వార్డును పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ డాక్టర్ శైలజ

కర్నూలు హాస్పిటల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలను మంగళవారం రాత్రి రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ పరిశీలించారు. ఆసుపత్రిలో విభాగాలతో పాటు సఖీ వన్‌స్టాప్ సెంటర్‌ను చైర్‌పర్సన్ సందర్శించారు. అక్కడ బాధిత మహిళలతో మాట్లాడి వారి కష్టాలను తెలుసుకుని ఓదార్చారు. ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం మహిళల భద్రతకు చాలా ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. మహిళలను ఆదుకోవడంలో భాగంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో సఖీ వన్ స్టాప్ సెంటర్లను నిర్వహించడం జరుగుతోందన్నారు. బాధిత మహిళలకు మహిళా పోలీస్ స్టేషన్‌లో సమన్వాయం చేసుకుని వారిని రక్షణ కల్పించడం జరుగుతుందన్నారు. అనంతరం గైనిక్ విభాగాన్ని సందర్శించారు. ఐసీడీఎస్ పీడీ నిర్మల, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, డాక్టర్ శివబాల, అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ క్లెయిమ్‌లు చెల్లించండి

- పార్లమెంట్‌లో ప్రస్తావించిన ఎంపీ శబరి

నంద్యాల రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఏపీ రైతులు పెడింగ్ క్లెయిమ్‌ల కోసం ఎదురు చూస్తున్నారని, వాటిని త్వరితగతిన చెల్లించేలా చర్యలు తీసుకోవాలని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పార్లమెంట్‌లో జరిగిన సమావేశాల్లో ఆమె మాట్లాడారు. జీరో అవర్‌లో ఎంపీ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన రైతులకు జాతీయ స్థాయిలో నివేదించబడిన క్లెయిమ్‌లలో 2020-21, 23,24 సంవత్సరాల మధ్య రూ76,965 కోట్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. అయితే ఏపీ పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్నారు. రూ.2,398 కోట్ల క్లెయిమ్‌లకు గానూ రూ.567 కోట్లు మాత్రమే చెల్లించారన్నారు. మిగతా రూ.1,800 కోట్ల క్లెయిమ్‌ల కోసం రైతులు ఎదురు చూస్తున్నారని వివరించారు. సకాలంలో పూర్తి చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కోళ్ల దాణ లారీ బోల్తా

తుగ్గలి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాతన ఆశ్రమ పాఠశాల సమీపంలో దాణ లోడుతో వస్తున్న లారీ బోల్తా పడింది. మంగళవారం మహారాష్ట్ర నుంచి సేలంకు కోళ్ల దానాతో వెళ్తున్న లారీ అదుపు తప్పింది. అయితే ఎదురుగా వాహనాలు రాకపోవడంతో ప్రమాదం జరగలేదు డ్రైవర్‌కు కూడా గాయాలు కాలేదు. తుగ్గలి ఎస్ఐ బాలనరసింహులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురు యూట్యూబర్లపై ఫిర్యాదు

డోన్ టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముగ్గురు యూట్యూబ్ చానల్ నిర్వాహకులపై సర్వేయర్ జగదీష్ డీఎస్పీ శ్రీనివాసులుకు మంగళవారం ఫిర్యాదు చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ ఈ నెల 19న సర్వేయర్ కార్యాలయంలో విధులకు ఆటంకం కలిగిస్తూ ఫొటోలు, వీడియోలు తీసి వేధింపులకు గురిచేసినట్లు సర్వేయర్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

పైప్‌లైన్ లీకేజీ పనులను పూర్తి చేయండి

నగర పాలక కమిషనర్ విశ్వనాథ్



హెచ్ఎన్ఎస్ఎస్‌లో నీటిని పరిశీలిస్తున్న కమిషనర్, అధికారులు

కర్నూలు న్యూసిటీ, జూలై 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని సంతోష్‌నగర్ వద్ద జాతీయ రహదారిపై లీకేజీ అయిన 1200 ఎంఎం(డయా మీటర్లు) పైప్‌లైన్ మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన అధికారులతో కలిసి లీకేజీ ప్రాంతాన్ని పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ మునగాలపాడు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుంచి అశోక్‌నగర్ నీటి శుద్ధి కేంద్రానికి నీటిని సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడిందన్నారు. దీంతో వెంటనే మరమ్మతు పనులను ప్రారంభించామని కమిషనర్ తెలిపారు. దీని ద్వారా బుధ, గురువారాల్లో నగర వ్యాప్తంగా తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని, నగర ప్రజలకు గమనించి సహకరించాలని కమిషనర్ కోరారు.

● కల్లూరు ప్రాంతానికి హెచ్ఎన్ఎస్ఎస్ నుంచి నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ తెలిపారు. టిడ్కో గృహాల సమీపంలోని హంద్రీ నీటిని, ఫ్రెషర్ ఫిల్టర్లను కమిషనర్ పరిశీలించారు. టిడ్కో వద్ద ఉన్న హెచ్ఎన్ఎస్ఎస్ నుంచి ప్రెషర్ ఫిల్టర్ ద్వారా అబ్బాస్‌నగర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు నీటిని పంపింగ్ చేయడానికి చర్యలు చేపట్టామన్నారు ఆయన వెంట డిప్యూటీ కమిషనర్ సతీష్‌రెడ్డి, డీఈఈలు మనోహర్ రెడ్డి, నరేష్, గిరిరాజు. ఏఈలు జనార్దన్, ప్రవీణ్ ఉన్నారు.

టిడ్కో గృహాల అభివృద్ధికి చర్యలు చేపట్టండి

కర్నూలు న్యూసిటీ, జూలై 22(ఆంధ్రజ్యోతి): జగన్నాథగట్టు వద్ద ఉన్న టిడ్కో గృహాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన టిడ్కో గృహాలను పరిశీలించి నివాసితులతో మాట్లాడారు. విద్యుత్ దీపాలు, రేషన్ దుకాణం, బస్సు సౌకర్యం, పోలీస్ అవుట్ పోస్టు, ప్రాథమిక పాఠశాల, సచివాలయం, అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని స్థానికులు కమిషనర్‌ను కోరారు. ఆయన వెంట డిప్యూటీ కమిషనర్ సతీష్‌రెడ్డి, టిడ్కో ఈఈ సూర్యనారాయణ, డీఈఈ రవిగుప్తా, ప్రత్యేక అధికారులు పెంచలయ్య, మధు, ఏఈ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

కొత్త పింఛన్లు మంజూరు చేయాలి

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ కొత్త పింఛన్లు మంజూరు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, అబ్దుల్లా డిమాండ్ చేశారు. కొత్తబస్టాండు దగ్గర ఉన్న డీవైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త పింఛన్ల మంజూరు కోసం వేలాది మంది వృద్ధులు, వితంతువులు, వికలాంగులు ఎదురు చూస్తున్నారని అన్నారు. సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శులు ప్రకాష్, విశ్వనాథ్, గోవర్ధన్, సాయికిరణ్, రఫీ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పతాక ఆవిష్కరణ దినోత్సవం

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): స్థానిక బి.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో మంగళవారం జాతీయ పతాక ఆవిష్కరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జెండా రూపకల్పన చేసిన పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రిన్సిపల్ నాగస్వామి నాయక్, అధ్యాపకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు వాణీప్రసన్న, రామకృష్ణ, జయశేఖర్, మల్లికార్జున పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న ఖాజాపాష

కర్నూలు న్యూసిటీ, జూలై 22(ఆంధ్రజ్యోతి): గుంటూరులో ఈ నెల 23, 24 తేదీల్లో జరిగే భవన నిర్మాణ కార్మిక సంఘం 8వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ ఖాజా పాష అన్నారు. మంగళవారం గడియారం ఆసుపత్రి కార్మికుల అడ్డా వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అడ్డా ప్రాంతాలలో కార్మికులకు కనీస వసతులు కల్పించాలన్నారు. వైసీపీ ప్రభుత్వంలో కార్మికులకు తీవ్రనష్టం జరిగిందన్నారు. కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు మహబూబ్ బాషా, అబ్దుల్ దేశాయ్, ఖలీల్ బాషా, సహాయ కార్యదర్శి గౌస్ బాషా పాల్గొన్నారు.

చలో విజయవాడను విజయవంతం చేయాలి: విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఆగస్టు 7న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు పిలుపునిచ్చారు. మంగళవారం కేకేప భవన్‌లో పోస్టరను విడుదల చేశారు. అంజిబాబు మాట్లాడుతూ సీఎం చంద్ర బాబు ఇచ్చిన హామీ ప్రకారం అందరిని రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనైటెడ్ ఎలక్ట్రిసిటి కాంట్రాక్టు ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి భీమేష్, ఎమ్మిగనూరు డివిజన్ నాయకులు నాగన్న, ప్రవీణ్ పాల్గొన్నారు.

కేరళ మాజీ సీఎం మృతి తీరని లోటు

సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్



అచ్యుతానందన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు న్యూసిటీ, జూలై 22(ఆంధ్రజ్యోతి): సీపీఎం నేత, కేరళ మాజీ ముఖ్యమంత్రి వీఎస్ అచ్యుతానందన్(101) మృతి కార్మిక లోకానికి తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ అన్నారు. మంగళవారం పాతబస్తీ హరికిషన్ సింగ్ సుర్జిత్ భవన్‌లో అచ్యుతానందన్ సంతాప సభను ఖాజాపాష అధ్యక్షతన జరిగింది. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి షరీఫ్, అబ్దుల్‌దేశాయ్, నాయకులు మహబూబ్ బాషా, మద్దిలేటి, శ్రీనివాసులు, నాగరాజు, బాలు పాల్గొన్నారు.

ఉల్లి సాగుకు సిద్ధం

● చేతికందిన ఉల్లి నారు
● వెంకటగిరిలో జోరుగా నాట్లు
● కూలీలకు డిమాండ్

కోడుమూరు రూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటగిరిలో ఖరీఫ్ కింద ఉల్లి నార్లు పనులు జోరందుకున్నాయి. ఉల్లి సాగునే నమ్ముకున్న ఆ గ్రామ రైతులు ఈ ఏడాది కూడా ఉల్లి పంట వేయడానికి సిద్ధమయ్యారు. వెంకటగిరి గ్రామంలోనే వర్షాధారం కింద ఏటా 1200 నుంచి 1500 ఎకరాల్లో ఉల్లి సాగు అవుతోంది. ప్యాలకుర్తి, కోడుమూరు, గోరంట్ల వంటి గ్రామాల్లో మరో 500 ఎకరాల వరకు సాగు చేస్తారు. నేలలో తగిన తేమ శాతం లేకపోయినా ఉల్లి నాటుకు రైతులు ఉపక్రమించారు. ఉల్లినారు చేతికందడమే దీనికి కారణం. వెంటగిరి గ్రామంలో ఉల్లి నాటు పనులతో చుట్టుపక్క గ్రామాలకు చెందిన కూలీలకు ఉపాధి లభిస్తోంది. కోడుమూరు, గూడూరు, క్రిష్ణగిరి, గోనెగండ్ల, దేవనకొండ మండలాల్లోని పలు గ్రామాల నుంచి కూలీలను ఇక్కడి రైతులు దిగుమతి చేసుకుంటున్నారు. ఆటో బాడుగను భరిస్తూ ఒక్కో కూలీకి రూ.400 ఇస్తున్నారు. రైతులందరూ నాటు పనులకు దిగడంతో పొలాల్లో కూలీల సందడి నెలకొంది.

ఐదారేళ్లుగా ఉల్లి నారు..

వెంకటగిరి రైతులు ఐదారేళ్లుగా ప్యాలకుర్తి వద్ద ఉల్లి నారు పెంచుతున్నారు. ఈ ఏడాది సుమారు 16 ఎకరాల్లో నారు పెంచారు. ఉల్లి సాగుకు ఆ గ్రామ రైతులు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారో దీనిని బట్టి అర్థమవు తుంది. ఎకరా ఉల్లినారు పెంపకానికి సుమారు రూ.90వేల నుంచి రూ.1.10 లక్షల వరకు పొలం యజమానికి రైతులు చెల్లిస్తున్నారు. పొలం యజమాని నారుకు క్రమం తప్పకుండా నీటి తడులు



ఉల్లి నాట్లు వేస్తున్న కూలీలు

అందించాల్సి ఉంటుంది. ఇక కలుపులు, మందులు, పిచికారి రైతులే చూసుకుంటారు. అలా పెంచుకున్న నారు సుమారు 45 నుంచి 55 రోజుల వ్యవధిలో తొలగించి పొలంలో నాటుకోవాలి. లేదంటే నారు దెబ్బతింటుంది. ఈ సమయంలో వర్షాలు పడితే సరి.. లేకపోతే రైతు పెట్టుబడి మట్టిపాలే. ఇటువంటి పరిస్థితులున్నా దేవుడిపై భారం వేసి ఉల్లి నారు పెంచుతారు. ఇలాంటి పరిస్థితుల్లో రెండు రోజులుగా చిన్నపాటి జల్లులు కురిశాయి. జల్లులకు పొలాలు పదునెక్కలేదు. అరపదునులోనే రైతులు ముందడుగు వేశారు. నారు దెబ్బతినకుండా ఉల్లి నాటుకు దిగామని రైతులంటున్నారు.

20 ఎకరాల్లో ఉల్లి



కొన్నేళ్ల నుంచి ఉల్లి సాగు చేస్తున్నా. లాభ నష్టాలతో సంబంధం లేకుండా ఉల్లిని నమ్ముకున్నాం. ఈఏడాది ఎనిమిది ఎకరాల సొంత పొలంతో పాటు మరో 12 ఎకరాలను కౌలుకు తీసుకుని ఉల్లిసాగు చేస్తున్నా. ఉల్లి నారు పెంచడానికి రూ.లక్ష ఖర్చు అయింది. కూలీలు, సేద్యం నారు రవాణా వంటివి మరో రూ.లక్షకు పైగానే అవుతుంది. ప్రస్తుతం నారు చేతికందింది.

● శివ, రైతు, వెంకటగిరి

పని దొరుకుతుంది



వెంకటగిరి గ్రామంలో ఉల్లి నాటు పనులకు ఏటా వస్తాం. ఇక్కడ సుమారు 20రోజుల వరకు పని దొరుకుతుంది. రైతులు ఆటో బాడుగకు భరిస్తూ కూలీలను పిలుస్తారు. మా గ్రామం నుంచి సుమారు 60మంది మహిళా కూలీలు ఉల్లి నాటు పనులకు వచ్చాం.

● రంగమ్మ, జి.మల్లాపురం, క్రిష్ణగిరి మండలం

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌ను కలిసిన డీఎస్పీ



రాయపాటి శైలజకు పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానిస్తున్న డీఎస్పీ, పోలీసు అధికారులు

కర్నూలు క్రైం, జూలై 22(ఆంధ్రజ్యోతి): కర్నూలు పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజను మంగళవారం మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ కె.శ్రీనివాసాచారి, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐలు అబ్దుల్ గౌస్, విజయలక్ష్మి, ఎస్ఐలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టాలని, బాధిత మహిళలకు అండగా నిలవాలని, త్వరితగతిన న్యాయం జరిగేలా కృషి చేయాలని ఆమె పోలీసు అధికారులను సూచించారు.

మహిళలపై జరుగుతున్న వేధింపులపై చర్యలు తీసుకోవాలి: ఐద్వా

కర్నూలు న్యూసిటీ, జూలై 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులపై చర్యలు తీసుకోవాలని శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ నిర్మలమ్మ కోరారు. మంగళవారం ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలు అధ్వర్యంలో నగరానికి వచ్చిన రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపేటి శైలజను కలిసి వినతిపత్రం అందజేశారు. నిర్మల మాట్లాడుతూ జిల్లాలో రోజురోజుకు మహిళలపై దాడులు, దౌర్జన్యాలు పెరుగుతున్నాయన్నారు. ఘటనలపై ఎప్పటికప్పుడు స్పందించి అధికారులు చర్యలు తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా అధ్యక్షురాలు అరుణమ్మ, కోశాధికారి సుజాత పాల్గొన్నారు.

కర్నూలు మెడికల్ కాలేజీలో నాలెడ్జ్ హబ్ సెంటర్



మాట్లాడుతున్న డాక్టర్ కేజీ గోవిందరెడ్డి

కర్నూలు హాస్పిటల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీలో నాలెడ్జ్ హబ్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు డా.కుమారస్వామిరెడ్డి, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు డాక్టర్ కేజీ గోవిందరెడ్డి తెలిపారు. ఈ మేరకు కర్నూలు మెడికల్ కాలేజీ కాన్ఫరెన్స్ హాలులో కేఎంసీ అల్యూమ్ని అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నాలెడ్జ్ హబ్ సెంటర్ నిర్మాణం కోసం నిధులను సేకరించాలని కోరారు. సమావేశంలో కార్యదర్శి డాక్టర్ బాలమద్దయ్య, కోశాధికారి డా.మహేశ్వరరెడ్డి, కేఎంసీ పూర్వ విద్యార్థులు డా.రామలింగారెడ్డి పాల్గొన్నారు.

కేవీఆర్ కళాశాల అభివృద్ధికి లాలెప్ప కృషి



మాట్లాడుతున్న డీఐఈవో సురేష్‌బాబు

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): కేవీఆర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల అభివృద్ధికి ప్రిన్సిపాల్ లాలెప్ప చేసిన కృషి అభినందనీయమని డీఐఈవో సురేష్‌బాబు అన్నారు. మంగళవారం కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రభుచరణ్ అధ్యక్షతన ఆర్ఐవోగా పదవీ బాధ్యతలు చేపట్టిన లాలెప్ప ఆత్మీయ అభినందన సన్మాన కార్యక్రమం జరిగింది. సురేష్‌బాబు మాట్లాడుతూ లాలెప్ప కృషితోనే కళాశాలకు సొంత భవనాలు ఏర్పడ్డాయని కొనియాడారు. అనంతరం విశ్రాంత ప్రిన్సిపాల్ కె.చెన్నయ్య మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి: ఏవో

సి.బెళగల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): రైతులు పంట నమోదు తప్పనిసరి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మల్లేష్ కుమార్ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని చింతమానుపల్లె గ్రామంలో రైతులు సాగు చేసిన పత్తిపంటను పరిశీలించారు. ఏవో మల్లేష్‌కుమార్ మాట్లాడుతూ పచ్చదోమపై అపోహ వద్దని, పచ్చపురుగు నివారణకు అస్టాఫ్, మోక్రోటొపాల్‌ను కలిపి పిచికారి చేయాలని రైతులకు సూచించారు. ఆయన వెంట ఎంపీఈవోలు, రైతులు ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

సి.బెళగల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇనగండ్ల గ్రామంలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 3 మోటార్‌సైకిళ్లు, రూ.2300 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పరమేష్ నాయక్ తెలిపారు. అలాగే మండలంలోని బురాన్‌దొడ్డి గ్రామ పోస్టుమాస్టర్‌గా పనిచేస్తున్న మానవ మధు పొదుపు డిపాజిట్ డబ్బులను రూ.1,13,000 వాడుకున్నారని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు.

ప్రజలను మోసగిస్తున్న ప్రభుత్వం : కాటసాని



ప్రజలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని

కల్లూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని పాణ్యం మాజీ ఎమ్మెల్యే, నంద్యాల జిల్లా వైసీపీ అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన బాబు ష్యూరిటీ -మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా 28వ వార్డు పందిపాడులో పర్యటించి సూపర్‌సిక్స్ పథకాల వైఫల్యాలను ప్రజలకు వివరించారు. కార్పొరేటర్లు, వైసీపీ అనుబంధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ

కర్నూలు స్పోర్ట్స్, జూలై 22(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయంలో క్రీడా సామగ్రి పంపిణీ కార్యక్రమం జరిగింది. జిల్లా వాలీ బాల్ అసోసియేషన్ కార్యదర్శి షరీఫ్ అహ్మద్ ఆధ్వర్యంలో సి.బెళగల్, బి.క్యాంపు వాలీబాల్ కోచ్‌లకు వాలీబాల్ క్రీడా సామగ్రి అందజేశారు. జిల్లాలో వాలీబాల్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తామని కార్యదర్శి తెలిపారు. కార్యక్రమంలో డీఎస్ఏ సిబ్బంది ఇర్ఫాన్, ఇమ్రాన్, కోచ్‌లు రాజేష్, పాల్ సుధాకర్ పాల్గొన్నారు.

గ్రామీణ సంక్షేమమే లక్ష్యం

కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి

కర్నూలు రూరల్ జూలై 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కూటమి పాలన సాగుతోందని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. కర్నూలు మండలం జి.శింగవరం గ్రామంలో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రామంలో టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథ కాలు గురించి ప్రజలకు వివరించారు. గ్రామంలో ప్రభుత్వ పాఠశా లను ఎమ్మెల్యే పరిశీలించారు. మధ్యాహ్న భోజనం ఏవిధంగా పెడుతు న్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు డానియేలు, కన్నయ్య పాల్గొన్నారు.

గూడూరు: సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్రంలో పేదరిక నిర్మూలన సాధ్యమని మత్స్యశాఖ జిల్లా అధ్యక్షుడు తెలుగు శ్రీనివాసులు అన్నారు. మంగళవారం గూడూరు నగర పంచాయతీ పరిధిలోని ఆయా కాలనీల్లో తెలుగు శ్రీనివాసులు ఆధ్వర్యంలో సుపరిపాలన తొలిఅడుగులో భాగంగా స్థానిక టీడీపీ నాయకులు ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో యూనిట్ కన్వీనర్ అక్కులదేవి గిడ్డయ్య, బూత్ ఇన్‌చార్జి ప్రసాద్ పాల్గొన్నారు.

సి.బెళగల్: కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని ఇనగండ్ల గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఎంపీటీసీ తిమ్మలమ్మ, టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తూ..ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.



జి.శింగవరంలో ప్రజలకు కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి



గూడూరులో ప్రజలకు కరపత్రాన్ని అందిస్తున్న మత్స్య శాఖ జిల్లా అధ్యక్షుడు తెలుగు శ్రీనివాసులు

మహాప్రస్థాన, లెనిన్ క్లాత్ సేవలు మెరుగుపరచండి

జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు

కర్నూలు హాస్పిటల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): రోగులకు అందించే మహాప్రస్థాన, స్వచ్ఛ సప్తవర్ణ దుప్పట్లు (లెనిన్ క్లాత్) సేవలను ఇంకా మెరుగుపరచాలని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఆదేశించారు. మంగళవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ చాంబరులో ఆయన సమీక్ష నిర్వహించారు. మహాప్ర స్థానానికి సంబంధించిన డెత్ రిజిస్టర్‌ను సూపరింటెండెంట్ పరిశీలించారు. ఆసుపత్రిలో చనిపోయిన వారిని ఏవిధంగా తరలిస్తున్నారని, రాత్రి పూట వాహనాలు వెళ్లడం లేదని తనకు ఫోన్లు వస్తున్నాయని, ఇక మీదట ఫిర్యాదులు వస్తే సహించేది లేదని సూపరింటెండెంట్ హెచ్చరించారు. రాత్రి పూట రెండు వాహనాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని, డ్యూటీలో ఉన్న డ్రైవర్లు ఎవరైనా స్పందించకపోతే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆసుపత్రిలోని పలు విభాగాల్లో రోగులకు స్వచ్ఛ సప్తవర్ణ దుప్పట్లు సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో అన్ని విభాగాలలో ప్రతి కలర్ గల దుప్పట్లు



ఏజెన్సీ నిర్వాహకులతో సమీక్ష నిర్వహిస్తున్న సూపరింటెండెంట్

అందుబాటులో ఉండేటట్లు చూసుకోవాలని, పలు విభాగాల్లో ఏడు రోజులు కలర్ల దుప్పట్లను ప్రతి రోజు మార్పు చేయాలని ఆదేశించారు. సమీక్షలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, హాస్పిటల్ ఇన్‌చార్జి సీఎస్ఆర్ఎంవో టీసీహెచ్ డా.వెంకటరమణ, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డా.పద్మజ, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, నర్సింగ్ సూపరింటెండెంట్ ఎస్పీ సావిత్రిబాయి, మహాప్రస్థానం మేనేజర్ హఫీజ్, సూపర్‌వైజర్ ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

వైభవంగా సుంకులమ్మ గ్రామోత్సవం



అమ్మవారి గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

గూడూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.నాగులాపురంలో సుంకులా పరమేశ్వరి అమ్మవారి గ్రామోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పెంచికలపాడులో చిలకలమన్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. రైతులు కాడుమానులతో ఊరేగింపుగా తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది, పురోహితులు, రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం

కర్నూలు న్యూసిటీ, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ టూరిజమ్ డెవపల్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ) కాంట్రాక్టు ఉద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని సంఘం కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. మంగళవారం వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహ న్‌రెడ్డిని ఎస్వీ కాంప్లెక్స్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. రాజశేఖర్ మాట్లాడుతూ సంస్థలో గత 23 సంవత్సరాలుగా కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విధానంలో చాలీచాలని జీతాలతో ఉద్యోగాలు చేస్తున్నా మన్నారు. ఉద్యోగులను రెగ్యులర్ చేయకుండా సంస్థను ప్రైవేటు పరం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. ఉద్యోగులు రాము, శ్రీధర్ పాల్గొన్నారు.



ఎస్వీ మోహన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం

ఇబ్బందుల్లో ప్రజలు, వాహనదారులు

కల్లూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): 19వ వార్డు గణేష్‌నగర్-2 పరిధిలోని నాలుగో తరగతి ఉద్యోగుల కాలనీలో నడిరోడ్డులో విద్యుత్ స్తంభం దర్శనమిస్తోంది. విద్యుత్ సంస్థలో కాంట్రాక్టు దక్కించుకున్న గుత్తేదారుడు ఇష్టారీతిన కరెంట్ స్తంభాలు వేశారని, అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



నాలుగో తరగతి ఉద్యోగుల కాలనీలో రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం

ప్రధాన రహదారిలో కరెంట్ స్తంభం ఏర్పాటు చేయడంతో కాలనీ ప్రజలు, వాహనదారులు నిత్యం అవస్థలు పడుతున్నారు. రాత్రివేళల్లో తరుచూ ప్రమాదాలకు ఈ కరెంట్ స్తంభం కారణమవుతుందని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

విజయంతో తిరిగి రండి



క్రీడాకారులతో మార్కెట్ యార్డు మాజీ చైర్‌పర్సన్ శమంతకమణి

కర్నూలు స్పోర్ట్స్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఈనెల 24న విజయవాడలో జరిగే జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ చాటి విజయంతో తిరిగి రావాలని మార్కెట్ యార్డు మాజీ చైర్‌పర్సన్ శమంతకమణి అన్నారు. మంగళవారం క్రీడాకారులకు తన వంతు సాయం అందజేశారు. క్రీడాకారులు లలిత, భార్గవ్, మల్లికార్జున, విశ్వాసరావు, తిలక్, అఖిల్, సాయికృష్ణ, హరిక్రిష్ణ, మనీష్‌లను ఆమె అభినందించారు.

అర్ధగేరి వైద్యాధికారిగా కిరణ్‌కుమార్



హాలహర్వి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్ధగేరి ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా కిరణ్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గ్రామాల నుంచి వచ్చే రోగులకు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందిస్తానన్నారు. సిబ్బంది మెరుగైన వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

వైసీపీ నాయకుల అరెస్టు అన్యాయం

మద్దికెర, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుల అరెస్టులు అన్యాయమని జడ్పీటీసీ సభ్యుడు డి.మురళీధర్ రెడ్డి, వైసీపీ నాయకుడు ఆర్.వెంకటేశ్వర్లు, సింగిల్ విండో మాజీ ఛైర్మన్ సర్కార్ వెంకట్రాముడు, మాజీ ఎంపీటీసీ డి.శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. అభివృద్ధి చేయకపోగా.. అరెస్టుపే ధ్యేయంగా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎ



మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

అర్హులందరికీ సంక్షేమం



తుగ్గలిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర

తుగ్గలి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు ఇచ్చామని, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, పత్తికొండ పరిశీలకుడు ఆదినారాయణ, రాష్ట్ర కార్యదర్శి బత్తిన వెంకట్రాముడు అన్నారు. మంగళవారం తుగ్గలిలో ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలు అందుతు న్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం వెనకబడిందన్నారు. మనోహర్ చౌదరి, తిమ్మయ్య చౌదరి, వల్లె వెంకటేశ్, తిరుపాల్ నాయుడు, మిద్దె వెంకటేశ్ యాదవ్ పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించండి



మాట్లాడుతున్న తహసీల్దార్ లక్ష్మీనారాయణ

హాలహర్వి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వీఆర్వోలు రైతులకు అందుబాటులో ఉండి భూ సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ లక్ష్మీనారాయణ సూచించారు. మంగళవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీఆర్వోల సమావేశం ఏర్పాటు చేశారు. రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. రీ సర్వే డీటీ బ్రహ్మయ్య, ఆర్ఐ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

25న స్వర్ణ ప్రాసనం పంపిణీ

ఆదోని టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈనెల 25న చిన్నారులకు స్వర్ణ ప్రాసనం పంపిణీ చేయనున్నట్లు ఆవోపా అధ్యక్షుడు వంకదార శ్రీనాథ్ గుప్తా, కాకుబాల్ నాగేష్ తెలిపారు. 9849478178 ఫోన్‌కు పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

వైద్యులు లేక ఇబ్బంది

- ఉన్నత విద్యకోసం వెళ్లిన ఇద్దరు వైద్యులు
- అప్పుడప్పుడూ వస్తున్న ఇతర వైద్యులు



తుగ్గలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

తుగ్గలి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుల కొరతతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. పీహెచ్‌సీకి దాదాపు 30 గ్రామాల నుంచి రోగులు వస్తుంటారు. ఇక్కడ పనిచేస్తున్న వైద్యులు ప్రవీణ్ కుమార్, ఫాతిమా నాలుగు నెలల క్రితం ఉన్నత చదువు కోసం వెళ్లారు. అప్పటి నుంచి పగిడిరాయి ఆసుపత్రి వైద్యులకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారు, అలాగే పత్తికొండ, పుచ్చకాయల మడ వైద్యులను డిప్యుటేషన్‌పై నియమించారు. అయితే అత్యవసర సమాయల్లో వైద్యులు లేకపోవడంతో రోగులు ఆర్ఎంపీలు, పత్తికొండ, గుత్తి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఆసుపత్రిలో అన్ని పరికరాలు ఉన్నా వైద్యులు లేకపోవడంతో వైద్యసేవలు అందడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి, రెగ్యులర్ వైద్యులను నియమించాలని రోగులు కోరుతున్నారు.



ఎమ్మెల్యే పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడికి కృతజ్ఞతలు తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

కార్మికుల హర్షం

ఆదోని, జూలై 22(ఆంధ్రజ్యోతి): తమ వేతనాలు పెంచినందుకు మున్సిపల్ ఇంజనీరింగ్ ఔట్ సోర్సింగ్ కార్మికులు మంగళశారం మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. మీనాక్షినాయుడు మాట్లాడుతూ ఆదోనిలో వంద మందికి పైగా ఉద్యోగస్థులు పని చేస్తున్నారని, వేతనాలు పెంచడం శుభసూచకమన్నారు. గత వైసీపీ ప్రభుత్వం నయాపైసా కూడా పెంచకుండా ఇబ్బందులకు గురి చేశారని ఆయన గుర్తు చేశారు.

కూటమి ప్రభుత్వంలోనే వేతనాల పెంపు

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మున్సిపల్ ఇంజనీరింగ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను కూటమి ప్రభుత్వం పెంచినట్లు ఎమ్మెల్యే డా.పార్థసారథి అన్నారు. మంగళవారం అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఈక్రాప్ నమోదు తప్పనిసరి

తుగ్గలి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రభుత్వ పథకాలు అందాలంటే ఈక్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించాలని ఏవో సురేష్ యాదవ్ సూచించారు. మంగళవారం ఎద్దులదొడ్డి గ్రామంలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. పంటల సస్యరక్షణపై రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చి, పంటలను నమోదు చేశారు. కౌలు రైతులు గుర్తింపు కార్డులు తీసుకోవాలన్నారు. అన్నదాత సుఖీభవ జాబితాను మరోసారి సరి చూసుకోవాలన్నారు.



పంటలను నమోదు చేస్తున్న ఏవో

సచివాలయ ఉద్యోగులకు సన్మానం

ఆస్పరి, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలం నుంచి బదిలీ అయిన 79 మంది సచివాలయ ఉద్యోగులను మంగళవారం సన్మానించారు. ఎంపీడీవో గీతావాణి, టీడీపీ కన్వీనర్ పరమారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు ఎక్కడ పనిచేసినా ప్రజాసేవకు అంకితం కావాలన్నారు. వైద్యాధికారి రఘురాంరెడ్డి, బాలకృష్ణ, ఎంపీటీసీ రహంతుల్లా, లక్ష్మన్న ఉన్నారు.



ఉద్యోగులను సన్మానించిన నాయకులు

అచ్యుతానందన్‌కు నివాళి

పత్తికొండటౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): కేరళ మాజీ సీఎం, సీపీఎం నాయకుడు వి.ఎస్. అచ్యుతానందన్‌కు మంగళవారం పత్తికొండలో నాయకులు, కార్యకర్తలు నివాళి అర్పించారు. ఈశ్వర్‌రెడ్డి భవన్‌లో చిత్రపటానికి పూలమాల వేశారు. నాయకుడు వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ కేరళ సీఎంగా ఆ రాష్ట్రాన్ని అభివృద్ధి చేశరన్నారు. వెంకటేశ్వర్లు, రంగారెడ్డి, దస్తగిరి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న నాయకులు

తల్లిదండ్రులు కోల్పోయిన పిల్లలకు సాయం

ఆస్పరి, జూలై 22(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను కోల్పోయిన నగరూరు గ్రామానికి చెందిన రంగమ్మ, మహాదేవప్ప కుమార్తెలకు అధికారులు సాయం అందించారు. తహసీల్దార్ రమేశ్వర్‌రెడ్డి, ఎంపీడీవో గీతావాణి మంగళవారం పరామర్శించి, రూ.5 వేలు, బియ్యం, బేడలు అందించారు. ఒకిరి పింఛన్ వస్తుందని, పంపిణీ చేసి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. చిన్న కుమార్తెను పదో తరగతి వరకు చదివిస్తామన్నారు. సర్పంచ్ మోహన్, మునిస్వామి పాల్గొన్నారు.



నగదు, సరుకులు ఇస్తున్న అధికారులు

విజయవంతం చేయాలి

పత్తికొండటౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఈనెల 29న జిల్లాకు వస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పర్యటనను విజయవంతం చేయాలని ఆ పార్టీ అసెంబ్లీ కో కన్వీనర్ గోవర్ధననాయుడు, కరణం నరేష్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం పత్తికొండలో సమావేశం నిర్వహించారు.

రాష్ట్రంలో సుపరిపాలన

మద్దికెర, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుపరిపాలన సాగుతోందని టీడీపీ పరిశీలకుడు ఆదినారాయణ అన్నారు. మంగళవారం మద్దికెరలో 'సుపరిపాలనలో తొలి అడుగు' నిర్వహించారు. సీఎం నాయుడు అధికారంలోకి వచ్చాక పింఛన్ల పెంపు, ఉచిత గ్యాస్, 'తల్లికి వందనం' అమలు చేశారన్నారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు రాజన్నయాదవ్, కన్వీనర్ ఎన్.లక్ష్మినారాయణ, గడ్డం రామాంజులు, భీమరాజు, గొడుగు సతీష్ ఉన్నారు.

క్వారీ రద్దు చేయాలి

ఆలూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని హత్తిబెళగల్ గ్రామ కొండల్లో క్వారీ అనుమతిని రద్దు చేయాలని సీపీఐ నాయకుడు రామాంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం మాట్లాడుతూ 2018లో ఈ క్వారీలో పేలుళ్లు జరిగి పది మంది కూలీలు సజీవ దహనం కావడంతో ప్రభుత్వం క్వారీని రద్దు చేసిందన్నారు. అయితే 2021లో ఎలాంటి అభిప్రాయాలు తీసుకోకుండా ఎలా అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. బాషా, చాపల గోపాల్ పాల్గొన్నారు.



బోరును బాగు చేయిస్తున్న అధికారులు

నీటి సమస్య పరిష్కరిస్తాం

మద్దికెర, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మద్దికెర, ఎం.అగ్రహారం గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని డిప్యూటీ ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. మంగళవారం బోర్లను బాగు చేయించారు. ఎం.అగ్రహారం బీసీ కాలనీలో అదనపు పైపులైన్ వేసి సమస్య తీరుస్తామన్నారు. చేతి పంపులకు సంబంధించిన పరికరాలు ఎంపీడీవో కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని, నీటి పథకాలకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాలని అధికారులు, కార్యదర్శులకు సూచించామన్నారు. కార్యదర్శి శివకుమార్ ఉన్నారు.

తీరని లోటు

ఆలూరు రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కేరళ మాజీ సీఎం, సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు అచ్యుతానందన్ మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటని ఆ పార్టీ ప్రాంతీయ కార్యదర్శి హనుమంతు, కె.పి.నారాయణస్వామి అన్నారు. మంగళవారం జ్యోతిబసు భవనంలో చిత్రపటానికి నివాళి అర్పించారు. మూడుసార్లు ప్రతిపక్ష నాయకుడిగా, కేరళ సీఎంగా ప్రజా సంక్షేమానికి కృషి చేశారన్నారు.

ఆదమరిస్తే గుంతలోకే!



ఆలూరు చెక్‌పోస్టు వద్ద ప్రధాన రహదారిపై గుంత

ఆలూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌యార్డు చెక్‌పోస్టు వద్ద ప్రధాన రహదారి టర్నింగ్‌లో గుంత ప్రమాదకరంగా ఉంది. కల్వర్టు కుంగిపోవడంతో వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాల బారిన పడే అవకాశముంది. అధికారులు పూడ్చి వేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు పక్కనే గొయ్యి

ఆస్పరి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిగిలి-బిణిగేరి గ్రామాల మధ్య ఆదోని ఆర్‌అండ్‌బి రోడ్డు పక్కలో తవ్విన నెట్‌వర్క్ గుంత ప్రమాదకరంగా మారింది. గుంత తీసి నాలుగు నెలలైనా ఇంతవరకు దానిని పూడ్చి పెట్టకపోవడంతో అటు ఇటు వెళ్లే వాహనాలు, ద్విచక్రవాహనాలు గుంతలో పడి ప్రమాదాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది. ఫైబర్ నెట్‌వర్క్ కోసం తీసిన గుంతను పూడ్చి ప్రమాదాల బారిన పడకుండా కాపాడాలని వాహనదారులు, పరజలు కోరుతున్నారు. ఫైబర్ నెట్‌వర్క్ కంపెనీ అధికారులు స్పందించాల్సి ఉంది.



చిగిలి గ్రామ సమీపంలో రోడ్డు పక్కనే తవ్వి వదిలేసిన గుంత

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సెట్కూర్ సీఈవో డా.వేణు గోపాల్

దేవనకొండ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువకులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సెట్కూరు సీఈవో డా.వేణు గోపాల్, సీఐ వంశీనాథ్ సూచించారు. మంగళవారం స్థానిక జూనియర్ కళాశాలలో 'మత్తు పదార్థాల వ్యసనం-పర్యవసానాలు' అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మత్తు మొదట్లో ఆనందంగా ఉంటుందని, అనంతరం మతిస్థిమితం కోల్పోయి నేరాలకు పాల్పడటాతరని హెచ్చరించారు. ప్రిన్సిపాల్ వేణుగోపాల్ శర్మ, అధ్యాపకులు కృష్ణమూర్తి, వీరగురుడు, తదితరులు ఉన్నారు.

మద్దికెరకు చేరుకున్న హంద్రీనీవా జలాలు

మద్దికెర, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17న సీఎం చంద్రబాబు విడుదల చేసిన హంద్రీనీవా జలాలు మంగళవారం మద్దికెర మండలంలోకి ప్రవేశించాయి. నీరు రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాలువ పరిధిలో బురుజుల, మద్దికెర, పెరవలి, ఎడవలి, బొమ్మనపల్లి, కొత్తపల్లి గ్రామాల పొలాలు ఉన్నాయి.



మద్దికెర కాలువలో నీరు

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం



ప్రజలతో మాట్లాడుతున్న ఉమాపతినాయుడు

ఆదోని, జూలై22(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ సీనియర్ నాయకుడు ఉమాపతినాయుడు అన్నారు. మంగళవారం ఆదోని మండలం నారాయణపురం గ్రామంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' నిర్వహిం చారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకలను వివరించారు. రంగస్వామినాయుడు, శంకర్, మాజీ ఎంపీటీసీ శేఖర్, సాధికాబేగం, శివలింగ, భీమలింగప్ప పాల్గొన్నారు.

అరెస్టు చేయాలి

ఆదోని అగ్రికల్చర్, జూలై 22 (ఆంధ్ర జ్యోతి): ఒడిస్సా రాష్ట్రంలో విద్యార్థినిపై అత్యాచారం చేసిన ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు ప్రధాన్‌ను అరెస్టు చేయాలని ఏబీవీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి ఉమా మహేష్ డిమాండ్ చేశారు. మంగళవారం ప్రభుత్వ డీగ్రీ కళాశాల వద్ద ఏబీవీపీ ఆందోళన చేశారు. విద్యార్థినిపై లైంగిక దాడిని ఖండిస్తున్నామని, నిందితుడిని బహిరంగంగా శిక్షించాలని కోరారు. నరసింహ, రంగనాథ్ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న ఏబీవీపీ కార్యకర్తలు

రైతుకు అండగా ఉంటాం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- పత్తికొండ సింగిల్ విండో అధ్యక్షుడు తలారి రంగప్ప



పత్తికొండ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఆర్థికపరంగా రైతులకు అండగా ఉండి సేవలందిస్తామని పత్తికొండ సింగిల్‌విండో అధ్యక్షుడు తలారి రంగప్ప అన్నారు.

ప్రశ్న: సహకార సంఘంలో రైతుల సంఖ్య ఎంత?
జవాబు: సుమారు 12వేల మంది రైతులు సభ్యులుగా ఉన్నారు.
ప్రశ్న: సంఘం టర్నోవర్ వివరాలు?
జవాబు: రైతులకు ఇచ్చిన రుణాలు, పొదుపు ఖాతాల నిర్వహణ, ఇతర రుణాలు కలుపుకుని రూ 50కోట్ల లావాదేవీలు ఉన్నాయి.
ప్రశ్న: ఎన్ని రుణాలు ఎన్ని ఇచ్చారు?
జవాబు: ఈ ఏడాది ఇంకా రుణాలు ఇవ్వలేదు. గతేడాది వరకు సుమారు 4వేల మందికి మార్ట్‌గేజ్‌కింద రుణాలు అందించాం. నెలాఖరు నుంచి కొత్త రుణాలు ఇస్తాం.
ప్రశ్న: బాధ్యతలు చేపట్టిన మీరు ఎలాంటి సేవలు అందించనున్నారు ?
జవాబు: రైతుగా నాకున్న అనుభవంతో రైతులకు ఆర్థిక సహకారం అందించేందుకు కృషిచేస్తా.

29న దుకాణాల వేలం

ఆదోని టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): లీజు కాల పరిమితి ముగిసిన మున్సిపల్ దుకాణాలను ఈనెల 29న వేలాలు నిర్వహించనున్నట్లు కమిషనర్ కృష్ణ మంగళవారం తెలిపారు. మొత్తం 37 దుకాణాల కాలపరిమితి ముగిసిందన్నారు. గత నెలలో 13 దుకాణాల వేలం వాయిదా పడగా, తిరిగి మూడు సంవత్సరాల కోసం వేలాలు నిర్వహిస్తామన్నారు.

తప్పుచేస్తే శిక్ష తప్పదు

తుగ్గలి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఎంతటి వారైనా తప్పు చేస్తే శిక్షలు తప్పవని టీడీపీ నాయకుడు తిరుపాల్ నాయుడు అన్నారు. మంగళవారం రాంపల్లిలో మాట్లాడుతూ లిక్కర్ స్కాంలో అరెస్టయిన మిథున్ రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి పై కక్ష సాధింపుతో కేసులు నమోదు చేస్తున్నారనీ వైసీపీ నాయకులు ఆరోపించడం హాస్యాస్పదమన్నారు.

యూరియా కొరత సృష్టిస్తే చర్యలు

- ఆర్డీవో భరత్ నాయక్ • పత్తికొండ, దేవనకొండలో తనిఖీ, • ఆదోనిలో సబ్ కలెక్టర్ పరిశీలన

పత్తికొండ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): యూరియా కొరతను సృష్టిస్తే చర్యలు తప్పవని ఆర్డీవో భరత్‌నాయక్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని యూరియా దుకాణాలను తనిఖీ చేసి, స్టాక్‌ను పరిశీలించారు. ఖరీఫ్ సాగుకు రైతులు ఎరువులకోసం ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందని, రాష్ట్రవ్యాప్తంగా యూరియా, ఎరువులను సిద్ధంగా ఉంచిందన్నారు. కొందరు వ్యాపారులు ఆన్‌లైన్‌లో స్టాక్ వివరాలు తప్పగా నమోదుచేస్తూ కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్‌మార్కెట్‌లో విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. వ్యాపారులు బిల్లు ఇవ్వాలని, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలోని చిన్నహుల్తి, హోసూరు, పుచ్చకాయలమాడ, కోతిరాళ్ల, దూదేకొండ, చందోలి, పత్తికొండ గ్రామాల్లో రైతుసేవా కేంద్రాల ద్వారా యూరియాను అందించారు. నలకదొడ్డి, జూటూరు, చక్రాళ్ల గ్రామాల రైతుసేవాకేంద్రాలలో రేపటి నుంచి యూరియా అందుబాటులో ఉంటుందని ఏవో వెంకటరాముడు తెలిపారు. రైతులకు సరిపోయే యూరియా, ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. వారితోపాటు డిటీ శ్రీదేవి, వీఆర్వో, వీఆర్ఏలు ఉన్నారు.

ఎరువుల కొరత సృష్టిస్తే చర్యలు

దేవనకొండ: ఎరువుల కొరత సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని పత్తికొండ ఆర్డీవో భరత్‌నాయక్ హెచ్చరించారు. దేవనకొండలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్ రామాంజినేయులు, ఆర్ఐ విజయభాస్కర్, ఏఈవోలు రంగన్న, మల్లికార్జున, వీఆర్వో కౌలుట్ల, తదితరులు ఉన్నారు.



పత్తికొండలో గోదాములను పరిశీలిస్తున్న ఆర్డీవో, ఏవో

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

మద్దికెర: డీలర్లు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ గుండాల్ నాయక్, ఏవో రవి హెచ్చరించారు. మంగళవారం మద్దికెర, ఎం.అగ్రహారం గ్రామాల్లో దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులు అడిగిన ఎరువులనే అమ్మాలని, దుకాణంలో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఎరువులను నిల్వఉంచి కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ అనుమతి ఉన్న ఎరువులు మాత్రమే అమ్మాలని, రైతులకు తప్పక రసీదు ఇవ్వాలన్నారు. సిబ్బంది ఆనంద్ తదితరులు ఉన్నారు.



ఆదోనిలో దుకాణాలను తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్

ఆదోని అగ్రికల్చర్ : పట్టణంలోని ఎరువుల దుకాణాలను సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ మంగళవారం రాత్రి తనిఖీ చేశారు. యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే దుకాణాల లైసెన్సు రద్దుచేస్తామని ప్రైవేటు డీలర్లను హెచ్చరించారు. యూరియా తీసుకునే రైతులు ఆధార్, వేలిముద్రలు వేయాలని, ఈపోస్ మిషన్‌లో కొనుగోలు చేయాలని సూచించారు.

గాజులదిన్నె ప్రాజెక్టుకు ఎల్లెల్సీ నీరు

● మూడేళ్లుగా వరద లేక హంద్రీనీవా, ఎల్లెల్సీ నీరే జీడీపీ కి దిక్కు ● జీడీపీలో కేవలం ఒక టీఎంసీ నీరు


గాజులదిన్నె ప్రాజెక్టుకు ఎల్లెల్సీనీటిని మళ్లిస్తున్న దృశ్యం


ప్రస్తుతం జీడీపీ ప్రాజెక్టులో ఉన్న ఒక టీఎంసీ నీరు

గోనెగండ్ల, జూలై 22(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో కూడా ఈ ఏడాది గాజులదిన్నె ప్రాజెక్టు కు వరద నీరు లేక పోవడంతో వెలవెల పోతోంది. ప్రస్తుతం ప్రాజెక్టు లో కేవలం 1టీఎంసీ నీరు మాత్రమే ఉంది. శనివారం తుంగభద్రదిగువ కాలువకు 186 క్యూసెక్కుల నీరు గోనెగండ్లకు చేరాయి. ఆ నీటిని గోనెగండ్ల ఎస్కేప్ చానల్ ద్వారా ఎల్లెల్సీ అధికారులు 111 క్యూసెక్కుల నీటిని గాజులదిన్నె ప్రాజెక్టు(జీడీపీ)కు మళ్లించారు. మిగిలిన 75క్యూసెక్కుల నీటిని కోడుమూరుకు మళ్లించారు. ప్రస్తుతం ఎల్లెల్సీ ద్వారా విడుదలైన నీరు తాగునీటికి మాత్రమే ఉప యోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పంట భూములకు తరువాత విడుదల చేస్తామని తెలిపారు. ఇక తాగునీటి పథకాలకు నీటి ఇబ్బంది ఉండదని అధికారులు పేర్కొన్నారు.

2022లో మాత్రమే ప్రాజెక్టుకు..

మూడేళ్లుగా గాజులదిన్నె ప్రాజెక్టుకు చెప్పుకోదగ్గ స్థాయిలో వరద నీరు వచ్చి చేరలేదు. 2022లో మాత్రమే ప్రాజెక్టుకు వరద వచ్చి చేరింది. ఇక అప్పటినుంచి ఇప్పటివరకు వరద చేరలేదు. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలైన పత్తికొండ, మద్దికేర, తుగ్గలి, పెరవలి తదితర ప్రాంతాల్లో భారీ వానలు పడక పోవడం కారణంగా ప్రాజెక్టు వరద నీరు వచ్చి చేరలేదు. సీఎం చంద్రబాబునాయుడు గతంలో తీసుకున్న నిర్ణయం కారణంగా హంద్రీనీవా నీటిని గాజులదిన్నె ప్రాజెక్టు మళ్లిస్తున్నారు. తుంగభద్ర దిగువ కాలువ నీటిని కూడా ఇరిగేషన్ అధికారులు జీడీపీలో నిలువ చేస్తున్నారు. ఈ రెండు కాలువల నీరు జీడీపీలో నిల్వ ఉంచడంతో ప్రాజెక్టు నీటితో కళకళలాడుతోంది. ఈనీటితోనే గత రబీ సీజన్‌లో ప్రాజెక్టు కింద 11వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు. అలాగే బండగట్టు, డోన్, కిష్టగిరి, తాగునీటి పథకాలకు నీరు అందుతుంది. ప్రస్తుతం ప్రాజెక్టు లో కేవలం 1 టీఎంసీ నీరు మాత్రమే ఉంది. గత 2022లో జూలై నెల 4.5 టీఎంసీ నిలువ ఉండేది. ఈ ఏడాది జూలై నెలలో కేవలం 1 టీఎంసీ మాత్రమే ఉంది. గత మూడేళ్లుగా ఈ ప్రాంతంలో భారీ వర్షాలు కురియని కారణంగా ఈ పరస్థితి ఏర్పడిందని తెలుస్తుంది.

మరో 15 రోజుల్లో హంద్రీనీవా నీరు

శ్రీశైలం డ్యాం వరదతో నిండింది. హంద్రీనీవాకు అధికారులు నీటి విడుదల చేస్తున్నారు. హంద్రీనీవా నీటిని పందికోన రిజర్వాయర్ మళ్లించేందుకు ఇరిగేషన్ అధికారులు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. రిజర్వాయర్‌కు నీటి విడుదల అయిన పక్షంలో ఆ నీటిని గాజులదిన్నె ప్రాజెక్టుకు మళ్లిస్తారు. 15రోజుల్లో నీటి విడుదల జరుగుతుందని తెలుస్తుంది. ఇక హంద్రీనీవా నీరు గాజులదిన్నెను చేరితే ఇక నీటి కష్టాలు తప్పినట్లే .

వేతన పెంపుపై హర్షం


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

ఎమ్మిగనూరు టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల వేతనాలు పెంచడంపై కార్మికుల అధ్యక్షుడు నారాయణ, కార్యదర్శి శివరామకృష్ణ హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పోరాటాలను గుర్తించి వేతనాలను పెంచుతూ జీవోను విడుదల చేయడం సంతోషించదగిన విషయమని 20 సంవత్సరాల నుంచి ఉన్న సమస్యను ప్రభుత్వం పరిష్కరించిందన్నారు. ఇందుకు మున్సిపల్ శాఖమంత్రి నారాయణకు, ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కార్మికులు ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డిని కలసి పూలమాలలతో సత్కరించి తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు. రాజేంద్ర, విజయ్, నరసప్ప, పంపాపతి పాల్గొన్నారు.

సమ్మె వాయిదా

మున్సిపల్ కాంట్రాక్ట్, పారిశుధ్య కార్మికుల సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ఇస్మాయిల్, సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు తెలిపారు.

నానో యూరియా వాడాలి

ఎమ్మిగనూరు జూలై 22 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటల సాగులో వ్యవసాయ అధికారుల సూచనలను, సలహాలను పాటిస్తూ నానో యూరియాను వాడకాన్ని అలవాటు చేసుకోవాలని ఏవో శివశంకర్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని కే తిమ్మాపురం, టీఎస్ కూలూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. పంటల సాగులో ఏవైన సందేహాలు ఉన్నట్లైతే వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు నరసింహుడు, వినోద్, రసూల్, వీహెచ్‌ఏ జోతిర్మయిలు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనపై అవగాహన

పెద్దకడుబూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెద్దకడబూరులోని ఆయా గ్రామాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్‌కు ఎంఈవో -2 రామ్మూర్తి పాఠశాలల మౌలిక వసతులపై మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం మండల కేంద్రమైన పెద్దకడబూరులోని ఎంపీపీఎస్ మెయిన్ పాఠశాలలో ఎంఈవో-2 ఆధ్వర్యంలో విద్యార్థులతో టొబాకో నియంత్రణపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

పశువుల యజమానులు అప్రమత్తంగా ఉండాలి

గోనెగండ్ల, జూలై 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పశువులకు మద్దచర్మ వ్యాధి సోకుతోందని, ఆ వ్యాధి పట్ల పశువుల యజమానులు జాగ్రత్తగా ఉండాలని జిల్లా పశుసంవర్ధనశాఖ ఉపసంచాలకులు దుర్గా ప్రసాద్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రమైన గోనెగండ్లలో పశుసంవర్ధన శాఖ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. పశుసంవర్ధన శాఖలో జరిగే పలు సంక్షేమ కార్యక్రమాలు, టీకా కార్యక్రమాల పై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో గోనెగండ్ల మండల సహాయ సంచాలకులు డాక్టర్ వెంకటేశ్వర్లు, అలాగే పశువైద్యాధికారులు, సహాయకులు పాల్గొన్నారు.

బంగారు ఆభరణాలు చోరీ

పెద్దకడుబూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రెండు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైన సంఘటన మండల పరిధిలోని చిన్నతుంబలం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన బుడిజగ్గుల ఈరన్న, కుటుంబ సభ్యులందరూ సుంకేశ్వరి గ్రామానికి చర్చి ప్రతిష్ట కోసం వెళ్లారు. సోమవారం ఇంటికి రాగా అప్పటికే తాళం తెరిచి ఉండటంతో ఇంట్లోకి వెళ్లి చూడగా రెండు తులాల బంగారు ఆభరణాలు ఎవరో గుర్తుతెలియన వ్యక్తులు దొంగలించారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నిరంజన్ రెడ్డి తెలిపారు.

బీమా చెక్కు అందజేత

కౌతాళం, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికి ప్రమాద బీమా అవసరమని కర్నూలు పోస్టల్ సూపరిటెండెంట్ జనార్దన్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో పోస్టల్ శాఖ నుంచి ప్రమాద బీమా తీసుకుని ఆకస్మాత్తుగా మృతిచెందిన వ్యక్తికి మంజూరైన ప్రమాద బీమా చెక్కును మృతుడి భార్య నామినికి టీడీపీ తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి దివాకర్ రెడ్డితో కలిసి సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఆదోని అసిస్టెంట్ సూపరిటెండెంట్ శ్రీధర్, టీడీపీ జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి కోట్రేష్‌గౌడ్, బీసీ ప్రధాన కార్యదర్శి కురుగోడు, పోస్టు మ్యాన్ మల్లప్ప గౌడ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


రైతులకు డ్రోన్‌ను అందిస్తున్న సబ్ కలెక్టర్, టీడీపీ ఇన్‌చార్జి

కౌతాళం, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాలతో రైతులు అభివృద్ధిలోకి రావాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, టీడీపీ మంత్రాలయం నియోజకవర్గ ఇంచార్జి రాఘవేంద్ర రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన కౌతాళంలో మంగళవారం మండల వ్యవసాయాధికారి శేషాద్రి, కౌతాళం విశాల సహకార పరపతి సంఘం అధ్యక్షుడు వెంకటపతిరాజుల ఆధ్వర్యంలో రైతులకు మంజూరైన సబ్సిడీ పథకాల పంపిణీ కార్యక్రమానికి వీరు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ మండలంలోని రైతులు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు అవసరమైన ఎరువులు పుష్కలంగా ఉన్నాయని ఎవరు ఆందోళన చెందవద్దని తెలిపారు. టీడీపీ ఇంచార్జీ రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ తమది రైతుల ప్రభుత్వమని రైతులు టెక్నాలజీని ఉపయోగించుకుని వ్యవసాయం చేయాలన్నారు. అనంతరం సబ్ కలెక్టర్, సొసైటీ చైర్మన్‌తో కలిసి రైతుకు డ్రోన్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌతాళం, కుంటనహాల్ సొసైటీల చైర్మన్‌లు వెంకటపతి రాజు, కుంటనహాల్ మారెప్ప, తహసీల్దార్ రజినీకాంత్ రెడ్డి, వ్యవసాయాధికారి శేషాద్రి, నాయకులు సతీష్ నాయుడు, కరె బసవనగౌడ, రాజానందు, కురువ వీరేష్ ఉన్నారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు

కోసిగి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించి విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.వీరేష్ కోరారు. మంగళవారం కోసిగిలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను పరిశీలించి హాస్టల్‌లో వెలగని వీదిలైట్లు, తిరగని ఫ్యాన్లను పరిశీలించారు. కనీసం విద్యార్థులకు దుప్పట్లు, దోమతెరలు కూడా లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో సమస్యలు పరిష్కరించి విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఎక్సైజ్ పోలీసుల దాడులు

ఎమ్మిగనూరు జూలై22(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నందవరం మండలం చిన్న కొత్తిలిలో గ్రామంలో ఎక్సైజ్ మొబైల్ పార్టీ పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. దాడుల్లో 12 ఒరిజినల్ చాయిస్ తెలంగాణ మద్యం సీసాలు కలిగి ఉన్న కురువ నాగేంద్రను అరెస్టు చేనట్లు మొబైల్ పార్టీ ఎక్సైజ్ సీఐ మొహిద్దిన్ తెలిపారు.

ప్రతి రైతుకూ.. యూరియా అందించాలి

మంత్రాలయం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలో పట్టాదారు పాసు పుస్తకం ఉన్న ప్రతి రైతుకు యూరియా అందించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్ యాదవ్, ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి గాబ్రియేల్, ఏఐటీయూసీ మండల కార్యదర్శి మస్తాన్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని సూగూరు రైతుభరోసా కేంద్రం వద్ద రైతులతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం అక్కడే ఉన్న వీఏఏ మాధన్న వినతి పత్రం అందజేశారు.

ముగతి సర్పంచ్‌కు టీడీపీ నాయకుల పరామర్శ

నందవరం, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముగతి గ్రామ సర్పంచ్ విరుపాక్షిరెడ్డిని టీడీపీ నాయకులు మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ సోమలగూడురు పార్థసారథిరెడ్డి, ఎమ్మిగనూరు నాయకులు కదిరికోట ఆదెన్న, కమలనాభరెడ్డి, ముగతి గ్రామ నాయకులు వీరారెడ్డి మంగళవారం పరామర్శించారు. ఇటీవల ముగతి సర్పంచ్ విరుపాక్షిరెడి భార్య ఆనందమ్మ మృతి చెందిందని తెలుసుకున్న వారు ముగతి గ్రామానికి వచ్చి ఆమె మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసి విచారం వ్యక్తం చేశారు. మనోధైర్యంగా ఉండి ప్రజా సేవలో బాగస్వాములు కావాలన్నారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలను కల్పించాలి


ఉత్సవ ఏర్పాట్లనను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

కౌతాళం, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఈ నెల 25 నుంచి ఆగస్టు 23వరకు జరగనున్న శ్రావణ ఉత్సవాల్లో ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనానికి వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ తెలిపారు. మండల పరిధిలోని ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న శ్రావణ మాసపు ఉత్సవాల ఏర్పాట్లను మంగళవారం సబ్ కలెక్టర్ పరిశీలించారు. ఆలయంలో దర్శనానికి చేపట్టిన క్యూలైన్ల ఏర్పాట్లను గురించి ఆలయ డిప్యూటీ కమిషనర్, ఈవో మేడిపల్లి విజయరాజుతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆలయం వద్ద చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించి ఉత్సవాలలో భక్తులు అసౌకర్యాలకు గురికాకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. దేవాలయం వద్ద వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆలయం ప్రాంగణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా ఉంచాలని తెలిపారు. ఎంఆర్‌పీ రేట్లకే సరుకులు అమ్మేలా రెవెన్యూ అధికారులు చూడాలన్నారు. అధిక రేట్లకు అమ్మితే వారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు. ఆర్టీసీ అధికారులు కూడా మంచి కండిషన్ ఉన్న బస్సులను నడపాలన్నారు. సబ్‌కలెక్టర్ వెంట కౌతాళం తహసీల్దార్ రజినీకాంత్ రెడ్డి, కౌతాళం సీఐ అశోక్ కుమార్ ఆలయ సిబ్బంది, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.

చెక్కరథంపై ప్రహ్లాదరాయలు


చెక్కరథంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జూలై 22(ఆంధ్రజ్యోతి): సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారుజామునుంచే పండితులు,అర్చకులు రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు నిర్వహించారు. చెక్క రథంను వివిధ పుష్పాలతో చూడముచ్చటగా అలంకరించి, వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు భక్తుల హర్షధ్వనాల మధ్య ప్రహ్లాదరాయలను అధిష్టించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. సంస్థాన పూజలో భాగంగా మూలరాములకు బంగారు నాణేలతో అభిషేకం చేశారు. ఇది భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

చాతుర్మాస దీక్షలు స్వీకరించిన పీఠాధిపతి

మంత్రాలయం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు 13వ చాతుర్మాస దీక్షలు స్వీకరించారు. మంగళవారం పూర్ణబోధ పూజా మందిరంలో శాస్త్రోక్తంగా, సాంప్రదాయ పద్ధతిలో ఎంతో పవిత్రంగా చేపట్టే దీక్షలను మఠం దివాన్‌లు సుజీంద్రాచార్, శ్రీనాథాచార్, ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, శ్రీపతాచార్, వెంకటేశ్ జోషీ, సురేష్ కోనాపూర్, గౌతమాచార్, బీఎం ఆనందరావు నగదు ఇచ్చి మంత్రాలయంలో దీక్షలు చేపట్టాలని ఆహ్వానించారు. వారి ఆహ్వానంతో తన 13వ చాతుర్మాస దీక్షలను స్వీకరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, వ్యాసరాజాచార్, వాధిరాజాచార్, జయతీర్థాచార్, ద్వారపాలక అనంతస్వామి పాల్గొన్నారు.

మంత్రాలయంలో కన్నడ నటుడు

రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కన్నడ ప్రముఖ సినీ నటుడు ధర్మ కీర్తి రాజ్ మంగళవారం మంత్రాలయంకు వచ్చారు. ఈయనకు మఠం అధికారులు ఘనంగా స్వాగతం పలికారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పెద్దకడుబూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్నతుంభళం గ్రామానికి చెందిన కర్ణాటక మద్యం అమ్ముతున్న కురువ మహదేవను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన కురువ మహదేవ మట్కా రాస్తూ, అక్రమ కర్ణాటక మద్యం అమ్ముతున్నాడని సమాచారం వచ్చిందన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

కోసిగి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కోసిగి మేజర్ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న తిరుమలేశ్వరరెడ్డి బదిలీల్లో భాగంగా నంద్యాల జిల్లాకు బదిలీ కావడంతో మంగళవారం కోసిగి మేజర్ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కుమారి అయ్యమ్మ, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి కే.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో తిరుమలేశ్వరరెడ్డికి పూలమాలలు, శాలువతో ఘనంగా సన్మానించారు కార్యక్రమంలో మాణిక్యరాజు, రాజేష్, పందికోన మారెప్ప పాల్గొన్నారు.

వైఎస్ జగన్ పాపాలు పండుతున్నాయ్


సీసీరోడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి


ప్రమాణా స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి

● ఇక దేవుడు కూడా కాపాడలేడు
● ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

గోనెగండ్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): 'ఐదేళ్లుగా జగన్ చేసిన పాపాలు ఇప్పుడు పండుతున్నాయి. ఒక్కొక్కటి బయటకు వస్తున్నాయి, మాజీ సీఎం జగన్‌ను ఇక దేవుడు కూడా కాపాడలేడని ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన గోనెగండ్లలో ఆయన పర్యటించారు. గ్రామాలోని చాకలి వీధిలో నరేదా నిధులు, రూ. 43 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు, డ్రైనేజి పనులకు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి భూమిపూజ చేశారు. అ ప్రాంతంలోని ప్రజలతో మాట్లాడారు

అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

రాయలసీమ అభివృద్ధి చెందాలంటే ఒక్క టీడీపీతో సాధ్యం అని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వేముగోడు గ్రామంలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. బీసీకాలనీలో రూ. 25 లక్షలో సీసీ రోడ్డు, డ్రైనేజి పనులకు భూమిపూజ చేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి తిరిగి టీడీపీ చేపట్టిన పలు సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సహకార సంఘాల ద్వారానే రైతుల..

సహకార సంఘాల ద్వారానే రైతుల అభివృద్ధి సాధ్యమని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం గోనెగండ్ల సహకార సంఘం అవరణంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం మండల పాలక వర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. సహకార సంఘం అధ్యక్షుడిగా ఎన్వీ రామాంజినేయులుని, డైరెక్టర్లు గా కడవల రమేష్, కురువ వెంకటేశ్వర్లతో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ప్రమాణాస్వీకారం చేయించారు. బీవీ దగ్గర ఉండి వారిని తమ స్థానాలలో కూర్చోపెట్టారు. ఎమ్మిగనూరు మార్కెట్‌యార్డు చైర్మన్ మల్లయ్య, మండల కన్వీనర్ తిరుపతయ్యానాయుడు, బేతాల బడేసా, గ్రామ మేజర్ సర్పంచ్ హైమావతి, అడ్వకేట్ చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, రమేష్‌నాయుడు, కాంట్రాక్టర్ షేక్షావలి పాల్గొన్నారు.

ప్రతిభకు పురస్కారం

నందవరం, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండల పరిదిలోని నాగలదిన్నె హైస్కూల్‌లో మంగళవారం పూర్వపు విద్యార్థులు 2024-2025లో ఉత్తమ ప్రతిభ కనపరిచి పలితాలు సాధించిన విద్యార్థులకు నగదు పారితోషకం అందించారు. ప్రధానోపాధ్యాయులు జాన్సన్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ ఏడాది పదవ తరగతిలో ఉత్తమ ప్రతిబ కనపరిన విద్యార్థిని మేకల చరితకు రూ 10వేలు, ద్వితీయ స్థానంలో ఉన్న విద్యార్థి వడ్డే బాలాజీకి రూ 8000, తృతీయ స్థానంలోని సురేంద్రకు రూ 6000 నగదుతో పాటు మెమొంట్‌ను అందజేసి సత్కారించారు.. కార్యక్రమంలో బహుమతులు అందజేసిన పూర్వపు విద్యార్థులు రాజాశరత్‌కుమార్, ఎమ్మిగనూరు మార్కెట్‌యార్డు డైరెక్టర్ కరుణం సుదీర్, కమాలకర్, రమేష్ పాల్గొన్నారు.

ఈనెల 26న 'మండల మీట్'

నందవరం, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పుల్లయ్య తెలిపారు. మంగళవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ 26న ఎంపీపీ ముగతి లక్ష్మీదేవమ్మ ఆద్వర్యంలో మండల మీట్ జరుగుతుందని మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిదులు తప్పని సరిగా హాజరుకావాలని కోరారు. మండలంలో జరిగిన పనులు, ప్రస్తుతం చేపట్టబోయే పనులను అధికారులు వివరిస్తారన్నారు. ఈ కార్యక్రమంకు హజరుకాని వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు సమావేశానికి మజరుకావాలన్నారు.

గ్రామాలకు తాగునీరు అందిస్తాం

గోనెగండ్ల, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఎంవీఎస్ స్కీమ్ ద్వారా మండలంలోని 14 గ్రామాలకు త్వరలో తాగునీరు అందిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం ఎంపీడీవో సమావేశ భవనంలో ఎంపీపీ నసూరుద్దీన్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పలు గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యదర్శులు ఎంపీడీవో మణిమంజరి, పలు శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమం అంటేనే చంద్రబాబు


కరపత్రాలు అందిస్తున్న యువ నాయకులు

మంత్రాలయం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఐదేళ్లుగా సంక్షేమాన్ని వైసీపీ భ్రష్టు పట్టించిందని, సంక్షేమం అంటేనే బ్రాండ్ అంబాసిడర్‌గా సీఎం చంద్రబాబు నాయుడు నిలుస్తారని టీడీపీ జిల్లా యువనాయకులు రాకేష్ రెడ్డి, రాజారెడ్డి, అన్నారు. మంగళవారం మంత్రాలయం పాత వీధిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు వివరిస్తూ సమస్యలను తెలుసుకుంటూ ముందుకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేష్, టీడీపీ పట్టణ అధ్యక్షులు వరదరాజులు, కంసాలి నరసింహ, మంచాల సొసైటీ డైరెక్టర్లు డీసీ తిమ్మప్ప పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి సహకారంతో టీఎస్ కూలురు గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపుతామని గ్రామ టీడీపీ అధ్యక్షులు రామకృష్ణ, చిన్న నాగన్న లు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని టీఎస్ కూలూరు గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాణేష్, చిరంజీవి పాల్గొన్నారు.

పెద్దకడుబూరు: కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టీడీపీ యువ నాయకులు రామకృష్ణారెడ్డి, టీడీపీ రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంతరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కల్లుకుంట గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బసలదొడ్డి ఈరన్న, సొసైటీ చైర్మన్లు మీసేవా ఆంజ నేయులు, నరసప్ప, పక్కిరెడ్డి నరసింహులగౌడ్, పాల్గొన్నారు.

మాన్యం భూముల్లో జోరుగా అక్రమ తవ్వకాలు

● చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు


బాపురంలోని దేవుని మాన్యంలో గరుసును తవ్విన ప్రదేశం

నందవరం, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆంజనేయస్వామి దేవుని మాన్యంలోని 18 ఎకరాల్లో ఎర్రమట్టి గరుసు తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. వారం రోజులుగా గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకుడి అండతో దాదాపు రోజుకు 20 ట్రాక్టర్లు తరలిస్తునట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అంతా తెలిసినా ఇక్కడ అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన నాయకుడు ఏకంగా రోజుకు 20 ట్రాక్టర్లు పెట్టి ఎర్రమట్టిని ట్రిప్పు రూ. 1200 కు అమ్ముకుని సోమ్ము చేసుకుంటారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 'దేవునిమాన్యంలో ఇదేంపని' అని గ్రామస్తులు అడిగితే 'ఎమ్మెల్యేతో మాట్లాడే ఈపని చేస్తున్నా'నని సదరు నాయకుడు చెప్పడంతో గ్రామస్తులు అవాక్కయ్యారు. ఈ విషయం విలేకరులకు చేరవేయడంతో ఎర్రమట్టిని తవ్వే ప్రదేశానికి వెళ్లేలోపు సదరు నాయకుడు ట్రాక్టర్లను ఎక్కడడిక్కడే నిలుపుదల చేసి తవ్వకాలు కూడా ఆపేసి చిత్తం పలాయించారు. రాత్రి పూట తవ్వకాలు జరుపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంపై గ్రామ నాయకులు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడం గమనార్హం. ఇప్పటికైన ఉన్నతాధికారులు పట్టించుకుని చర్యలు తీసుకోకపోతే నాయకుడి ఆగడలకు అంతే లేకుండా పోతుందని గ్రామస్థులు వాపోతున్నారు. అయితే 'అధికారులకు కూడా వాటా ఇస్తున్నా'నని తెగేసి కొంత మందితో చెపుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామ వీఆర్వో నతానీయేలును వివరణ కోరగా తాను కొత్తగా వచ్చానని తనకేమి తెలియదని తలారులను పంపి అక్రమ తవ్వకాలను నిలుపుదల చేస్తానని తెలిపారు.